


విజయవాడ - మచిలీపట్నం రహదారి

బందరు పోర్టు వయా ఓఆర్ఆర్

బందరు పోర్టును తెలంగాణ రాష్ట్రంతో అనుసంధానించేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) కల సాకారం కాబోతున్న వేళ ఈ ప్రక్రియ మరింత ఊపందుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు.. విజయవాడ నుంచి అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా మచిలీపట్నం పోర్టుకు రహదారిని అనుసంధానించేందుకు ప్రణాళిక రచించారు. పోర్టు పనులు పూర్తయ్యి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించే సమయానికి ఈ రోడ్ల పనులు కూడా కొలిక్కి రావటానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి కనెక్టివిటీ

అనుసంధానానికి ప్రభుత్వం అడుగులు

- హైదరాబాద్ - విజయవాడ 6 వరసలకు అనుమతినిచ్చిన కేంద్రం
- రూ.7,106 కోట్ల వ్యయంతో 161.58 కిలోమీటర్ల విస్తరణ
- 6 వరసలుగా విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65
- తుది దశకు డీపీఆర్ రూపకల్పన.. 65 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతికి బందరు పోర్టును గేట్ వేగా తీర్చిదిద్దాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. దీనిలో భాగంగా అమరావతికి బందరు పోర్టు అనుసంధానంపై దృష్టి సారించింది. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా హైదరాబాద్ నుంచి బందరు పోర్టుకు కనెక్టివిటీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. రెండు రాష్ట్రాల ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్ - 65ను నాలుగు వరసల నుంచి ఆరు వరసల విస్తరణకు తాజాగా అనుమతులు ఇచ్చింది. డీపీఆర్ కూడా తుది దశకు చేరుకుంది. రూ.7,106 కోట్ల వ్యయంతో 161.58 కిలోమీటర్ల మేర ఆరు వరసలుగా విస్తరించనున్నారు. ఇది హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు నుంచి గొల్లపూడి వరకు ఉంటుంది. దీంతో పాటు విజయవాడ-మచిలీపట్నం వైపు ఎన్‌హెచ్ - 65ను కూడా ఆరు వరసలుగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం మిగతా 6లో..


ఆరు వరసలుగా అభివృద్ధి కానున్న విజయవాడ - హైదరాబాద్ రహదారి

నకిలీల్లో కలవరం!

వాణిజ్య పన్నుల శాఖలో దొంగ పత్రాలతో ఉద్యోగాలు

- ఒక మహిళా అటెండర్‌ను గుర్తించిన అధికారులు
- ఉద్యోగం నుంచి తొలగింపు.. మరికొంతమంది ఉన్నట్టు ఆరోపణలు


కమర్షియల్ ట్యాక్స్ ఆఫీస్

వాణిజ్య పన్నుల శాఖలో నకిలీ ధ్రువీకరణపత్రాల వ్యవహారం కలకలం రేపుతోంది. వివిధ విద్యార్హతలతో ఉద్యోగాలు చేస్తున్న వారు నకిలీ ధ్రువీకరణపత్రాలు సమర్పించి కొలువులు పొందారని కొన్నాళ్లుగా ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా అటెండర్, వాచ్‌మన్ ఉద్యోగాల్లో ఈ వ్యవహారం నడిచినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నకిలీ ధ్రువీకరణపత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారు ఆ శాఖలోని ఉద్యోగ సంఘాల నాయకుల ద్వారా రాయబారాలు నడుపుకుని ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. వీరిలో కొంతమంది ఇప్పటికే రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందినట్టు తెలుస్తోంది. తాజాగా ఒక మహిళా అటెండర్ ఉద్యోగంలో చేరినప్పుడు ఎలాంటి విద్యార్హత లేకపోయినా ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నట్టు ధ్రువీకరణపత్రాన్ని అధికారులకు సమర్పించింది. ఈ ధ్రువీకరణపత్రం నకిలీదని తెలియడంతో ఆమెపై అధికారులు వేటు వేశారు. దీనితో నకిలీ ధ్రువీకరణపత్రాలతో కొలువుల్లో కొనసాగుతున్న వారిలో కలవరం మొదలైంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ కేదారేశ్వరిపేటకు చెందిన జ్యోతి అనే మహిళ కారుణ్య నియామకం ద్వారా వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగిగా చేరింది. జ్యోతికి ఇద్దరు అన్నయ్యలు ఉండేవారు. ఆమె తల్లి ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగి. ఆమె చనిపోయిన తర్వాత ఆ ఉద్యోగాన్ని పెద్దన్నయ్యకు ఇచ్చారు. తర్వాత కొన్నాళ్లకు అతడు మరణించడంతో రెండో అన్నయ్యకు ఆ ఉద్యోగం వచ్చింది. కారుణ్య మిగతా 6లో..

దుర్గగుడి ఈవోగా శీనా నాయక్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


వి.కె.శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంకార్యనిర్వహణాధికారిగా ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీగా పనిచేస్తున్న వి.కె.శీనా నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం దుర్గగుడి ఈవోగా దేవదాయ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అటు కమిషనర్ బాధ్యతలు, ఇటు దుర్గగుడి ఈవో బాధ్యతలు చూడటం ఇబ్బందిగా మారటంతో దుర్గగుడికి రెగ్యులర్ ఈవోను నియమించాలన్న ప్రతిపాదన చేసి ఆయనే ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. కాగా, శీనా నాయక్ 2017లో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, కావలి ఆర్డీవోగా పనిచేశారు.

సర్కార్తోట వాసులకు విముక్తి

కలెక్టర్ బాలాజీకి అవార్డు 8లో

- రేపు గవర్నర్ చేతుల మీదుగా అందజేత

భూ బాధలు

అరెకరం ఆక్రమించి పట్టాదారు పాస్‌పుస్తకం తెచ్చుకున్న పక్కపొలం వారు

- సర్వే చేసి మా భూమి విడగొట్టాలని అధికారుల చుట్టూ తిరుగుతున్న దంపతులు
- పట్టించుకోని అధికారులు.. మీరే సమస్యను పరిష్కరించుకోవాలని సలహా
- తమ భూమిని అన్యాయంగా 22ఏలో చేర్చారని పలువురు ఆవేదన

కలెక్టరేట్‌లో కొమ్మురాజు శివసాయిప్రసాద్, మంజూష



ఈ ఫొటోలో కనిపిస్తున్న దంపతులు కొమ్మురాజు శివసాయిప్రసాద్, మంజూష. ఉంగుటూరు మండలం పెదఅవుటపల్లి గ్రామానికి చెందిన వారు. వీరి కుటుంబానికి సర్వే నెంబరు 94, 93/4, 93/8లలో 9.60 ఎకరాల భూమి ఉంది. అన్నదమ్ముల వాటాలు వేసుకుని భూమిని సాగు చేసుకుంటున్నారు. ఈ భూమిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న అరెకరం భూమిని పక్కనే భూమి ఉన్న వారు ఆక్రమించేసుకుని, సర్వే నెంబర్లు మార్పు చేసి, పట్టాదారు పాస్‌పుస్తకాలు తమపేరున తెచ్చుకున్నారు. అరెకరం భూమిని తమ ఆధీనంలో ఉంచేసుకున్నారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న శివసాయిప్రసాద్ తన భూమిని పక్క పొలం వారు ఆక్రమించుకున్నారని, పట్టాదారు పాస్‌పుస్తకం కూడా పుట్టించారని, ఇది అన్యాయమని, సర్వే చేసి తన భూమి విడగొట్టాలని, అన్ని ఆధారాలతో పలుమార్లు అర్జీ పెట్టుకున్నారు. సర్వే తూతూ మంత్రంగా జరిపిన రెవెన్యూ అధికారులు ఈ భూమి మీ పేరున లేదని చెప్పి వెళ్లిపోయారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళితే గంటల తరబడి బయటే నిలబెట్టి తర్వాత చూద్దామని చెప్పి పంపేస్తున్నారని దంపతులు వాపోతున్నారు. గత నెల 21వ తేదీన కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ సమర్పించారు. అయినా వీరి సమస్యను పట్టించుకున్నవారే లేరు. ఇటీవల తహసీల్దార్ కార్యాలయానికి వెళితే మీరే సమస్యను పరిష్కరించుకోవాలని ఉచిత సలహా ఇవ్వడం గమనార్హం.

- ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

22-ఎ ఎత్తి వేయాలని బాధితుల పోరాటం

బాపులపాడు మండలం కోడూరుపాడులో ఆర్ఎస్ నెంబరు 55/2 నుంచి 14 సర్వే నెంబర్లలో 27 ఎకరాల భూమి ఉంది. 2015లో ల్యాండ్ కన్వర్షన్, 5/2 నుంచి 14వ సర్వే నెంబరు వరకు నాలుగు ఎకరాల భూమిని మార్టిగేజ్ చేసి సీఆర్‌డీఏ అనుమతులు ఇచ్చింది. నాలాపన్ను కూడా కట్టించుకున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో ల్యాండ్ కన్వర్షన్ ఫీజు చెల్లించిన అనంతరం నూజివీడు ఆర్‌డీవో ఈ భూములను పరిశీలించి అనుమతులు ఇచ్చారు. రైతులు భూములు విక్రయించిన సమయంలో రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు తదితరులు ఈ భూమిలోని ప్లాట్‌లను కొనుగోలు చేశారు. వారిపేరున ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. ఇంతా జరిగిన తర్వాత బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో 55/2 నుంచి 14వసర్వే నెంబరులోని నాలుగు ఎకరాల భూములను 22-ఎలో చేర్చారు. ఇక్కడి ప్లాట్‌లను కొనుగోలు చేసినవారు ఆడపిల్లలకు పసుపు కుంకుమల కింద ఇచ్చేందుకు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఆడపిల్లల పేరున రిజిస్టర్ చేసేందుకు ప్రయత్నిస్తే 22-ఏలో ఈ భూములు ఉన్నాయని రిజిస్ట్రేషన్‌లు జరగవని చెప్పి ఆ కార్యాలయ అధికారులు పంపేస్తున్నారు ఆరోగ్య సమస్యలు, వృద్ధాప్యంలో ఉన్న వారు వివిధ అవసరాల నిమిత్తం ఈ ప్లాట్‌ను విక్రయించాలంటే రిజిస్ట్రేషన్ జరగడం లేదు. దీంతో బాధితులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నా వారు పట్టించుకోవడం లేదు. ఒకటీ, రెండు సార్లు సమస్యను విని, ఆ తర్వాత గంటలకొద్ది తమను నిలబెట్టి మీ సమస్య ఇప్పట్లో పరిష్కారం మిగతా 6లో..

ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం!

సీపీ రాజశేఖర్‌బాబు విధుల్లో చేరగానే ఉత్తర్వులు

ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై అసంతృప్తి

కమిషనరేట్ పరిధిలో బదిలీలకు రంగం సిద్ధం!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలగబోతుందా? త్వరలోనే బదిలీల ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయా? కొన్ని స్టేషన్ల విషయంలో మార్పులు కచ్చితంగా చేయాలని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారా? అంటే పోలీసు వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొంతమంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయాలన్న యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు సెలవులో ఉన్నారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. రాజశేఖరబాబు ఈ నెల 11వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఆయన 12వ తేదీన విధుల్లో చేరతారు. ఆ తర్వాత బదిలీల ఫైలు సీపీ టేబుల్ మీదకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయంగా తెలిసింది.

మూడు స్టేషన్లలో కదలిక ఖాయం?

కమిషనరేట్ పరిధిలో ఉన్న కొన్ని పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై సీపీ అసంతృప్తితో ఉన్నారు. ఆయన నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవడంలో వారు విఫలమవుతున్నారన్న భావన ఉంది. మరికొంత మంది ఇన్‌స్పెక్టర్లు విధి నిర్వహణలో చురుగ్గా వ్యవహరించడం లేదన్న అభిప్రాయం ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్టీఆర్ జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌కు కొత్త ఇన్‌స్పెక్టర్లు వచ్చారు. ఇన్‌స్పెక్టర్లు ఒక స్టేషన్‌లో రెండేళ్ల పాటు పనిచేసే అవకాశం ఉంది. రెండేళ్లు దాటిన ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసే అధికారం అధికారులకు ఉంది. ఇప్పటికే సీపీ కొంతమంది ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై ఒక అంచనాకు వచ్చారు. విజయవాడ నగరంలో మొత్తం 13 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఇవి కాకుండా రూరల్ గ్రామాల్లో 15 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లంతా ఏడాది కాలాన్ని పూర్తి చేసుకోవడానికి దగ్గరలో ఉన్నారు. ఈ స్టేషన్లలో ఎవరెవరిని బదిలీ చేయాలన్న దానిపై కమిషనర్ కార్యాలయంలో చర్చలు జరుగుతున్నాయి. కమిషనరేట్ పరిధిలో మూడు స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లను మార్పు చేయాలని మిగతా 6లో..



దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సులు

దుర్గమ్మ భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం

ఇంద్రకీలాద్రి, మే 6 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి ఘాట్ రోడ్డు మరమ్మతు పనుల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు దేవస్థానం ఈవో, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు వన్ టౌన్ సీతమ్మవారి పాదాలు, భవానీపురం పున్నమీఘాట్ నుంచి భక్తులకు ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడకుండా ఉండేందుకు ఇంజనీరింగ్ అధికారులు ఐరన్ మెస్ ఏర్పాటు పనులను మంగళవారం నుంచి ప్రారంభించారు. ఈనెల 8 వరకు అధికారులు ఘాట్ రోడ్డును మునివేస్తూ.. భక్తులకు ఇబ్బందులు లేకుండా సీతమ్మవారి పాదాలు, పున్నమీఘాట్ నుంచి ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లుల కొరకు వ్యాను ఏర్పాటు చేశారు. దుర్గమ్మ దర్శనానికి క్యూలలో భక్తులు బారులు తీరారు.

దుర్గమ్మను దర్శించుకున్న వీహెచ్‌పీ నేత అలోక్ కుమార్



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను మంగళవారం విశ్వహిందూ పరిషత్ అఖిల భారత అధ్యక్షుడు అలోక్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆయనకు ఆలయ ఉద్యోగులు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

అభయాంజనేయుని సేవలో.. ఎంపీ, ఎమ్మెల్యే

» భోజనశాల నిర్మాణానికి రూ.35 లక్షలు

హనుమాన్‌జంక్షన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం వెనుక యనమదల రామస్వామి సత్రం ఆవరణలో భోజనశాల నిర్మాణానికి రూ.35లక్షలు కేటాయిస్తున్నట్టు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్ ప్రకటించారు. మంగళవారం ఆయన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో దాతల సహాయంతో నిర్వహిస్తున్న మంగళవారం అన్నదాన కార్యక్రమానికి వసతి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎంపీ గతంలో హామీ ఇచ్చారు. ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం భోజనశాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి అంచనాలు తయారుచేసి పంపాలని, భవనంపై సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భోజనశాలలో అన్నక్యాంటీన్ నిర్వహించడంతో పాటు పేదలు వివాహాలు చేసుకునే విధంగా మండపాన్ని నిర్మిస్తామని తెలిపారు. తొలుత ఈవో తారకేశ్వరరావు ఎంపీకి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, వడ్డి వాసవీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సిటీ బస్సును పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

ఆర్టీసీ సిటీ ఆర్డనరీ బస్సులు సిద్ధం

» పరిశీలించిన ఆర్టీసీ ఎండీ

బస్‌స్టేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జోనల్ వర్క్‌షాపు ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా తయారు చేసిన కొత్త సిటీ ఆర్డనరీ బస్సును మంగళవారం వైస్ చైర్మన్, ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పరిశీలించారు. నూతనంగా తయారు చేసిన బస్సును అధికారులు విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంగణం వద్దకు తీసుకువచ్చారు. ఎండీ ద్వారకా తిరుమలరావు బస్సును పరిశీలించి బస్సు బాడీకి వాడిన మెటీరియల్, పెయింటింగ్, సీటు నాణ్యత, తయారు చేయటానికి అయిన ఖర్చు వంటి ఇతర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో జోన్ల పరిధిలోని వర్క్‌షాపుల్లో బస్సు బాడీలు తయారు చేయటానికి కావాల్సిన వనరులు, సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఎండీ అధికారులను ఆదేశించారు. ఎండీ వెంట సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జి.వి.రవి వర్మ (అడ్మిన్), ఎ.అప్పలరాజు (ఆపరేషన్), విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం, ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం, చీఫ్ మెకానిక్ ఇంజనీర్ (ఎం) జి.నాగేశ్వరరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వృత్తాకారంలో నిల్చొని జీరోషాడోను పరిశీలిస్తున్న విద్యార్థులు

గోరా టెక్నో హబ్‌లో జీరో షాడో డే

బెంజిసర్కిల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : బెంజిసర్కిల్ నాస్తిక కేంద్రంలోని గోరా టెక్నోహబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులు, నగర పౌరులు జీరో షాడో డేను తిలకించారు. ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్స్ సెర్చ్ క్యాంపెయిన్ జాతీయ సహాయ కన్వీనర్, ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత మేకా సుసత్య రేఖ హాజరయ్యారు. సూర్యుడు కదిలే విధానం, జీరో షాడో మన కిందకు ఎలా విద్యార్థులకు వివరిస్తూ ప్రత్యక్షంగా చూపించారు. ఈ ఆసక్తికర ఖగోళ పరిణామం తిరిగి ఆగస్టు 7న తిలకించవచ్చని ఈమె పేర్కొన్నారు. పిల్లల్లో సైన్స్ టెక్నాలజీపై ఆసక్తిని పెంచేలా గోరా టెక్నోహబ్ కృషిని అభినందించారు. గోరా టెక్నో హబ్ చైర్మన్ డాక్టర్ జి.సమరం పర్యవేక్షణలో వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రశ్మి, నియంత, సకల, డాక్టర్ జగతి తదితరులు పాల్గొన్నారు.

ఆసియాలోనే రెండో అతిపెద్దది.. దేశంలోనే అత్యంత రద్దీ బస్‌స్టేషన్‌లలో ఒకటి.. 28 ఎకరాల విస్తీర్ణం.. 62 ప్లాట్‌ఫాంలు ఈ బస్‌స్టేషన్ ప్రత్యేకత.. మూడువేలకు పైగా బస్సులు ఇక్కడ నుంచి వివిధ రాష్ట్రాలకు, ప్రాంతాలకు ప్రయాణిస్తాయి.. రోజూ సుమారు లక్షన్నర మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్‌స్టేషన్‌లో షాపులు, డార్మిటర్, ఇతర వసతుల నుంచి నెలకు రూ. కోటిన్నర వరకు ఆదాయం వస్తోంది. ఇంత ఘనత ఉన్న బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

ఆసియాలో అతిపెద్దది..

» కోట్ల ఆదాయం వస్తున్నా కనీస వసతులు కరవు
» ప్రయాణికుల ఇబ్బందులు పట్టని అధికారులు
» ఎక్కడ చూసినా దుర్గంధమే..
» పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ దుస్థితిపై ప్రత్యేక కథనం..





చెరువును తలపిస్తున్న బస్టాండ్ ఆవరణ

అభివృద్ధిలో ఆమడ దూరం!

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతికి అతి సమీపంలో.. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. రోజూ లక్షల్లో ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అమరావతి అభివృద్ధి పనులు ప్రారంభంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాల్సిన అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చినుకు పడితే చిత్తడే..

రెండ్రోజుల క్రితం కురిసిన కొద్దిపాటి వర్షానికే బస్‌స్టేషన్‌లోకి నీరు చేరింది. దీనికి తోడు కాలం చెల్లిన పైపులు.. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నీరు బయటకు ఎదగదన్నింది. కొన్నిచోట్ల పైపులు పగిలి నీరు ఫ్లోరింగ్‌పైకి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్‌స్టేషన్‌కు నాలుగు దిక్కులా ఇదే పరిస్థితి కనిపించింది. కనీసం నీటిని తొలగించేందుకు సరైన పరికరాలు కూడా లేక పారిశుధ్య సిబ్బంది చీపుర్లతోనే తంటాలు పడుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్‌స్టేషన్‌లో నడవాలంటేనే భయపడుతున్నారు. కోట్లఆదాయం వస్తున్నప్పటికీ కనీసం శిథిలమైన పైపులు మార్చేందుకు అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కేబిన్లలోకి కూడా నీరు చేరుతున్నా పట్టించుకునే నాధుడు లేడని పలువురు ముక్కున వేలుసుకుంటున్నారు.



ఫ్లోరింగ్‌పైకి చేరిన వర్షపు నీరు



పైపు లీకేజీతో ధారలా వస్తున్న నీరు

చెరువును తలపిస్తున్న ప్రాంగణం

వర్షం పడితే బస్‌స్టేషన్ ప్రాంగణం చెరువును తలిపిస్తుంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. సిటీ బస్‌స్టాపుల నుంచి లోపలికి వెళ్లే మార్గం తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. వర్షం పడితే పక్కనే ఉన్న కాలువ ద్వారా ప్రవహించే చెత్తాచెదారం అంతా బస్‌స్టేషన్ ఆవరణలోకి రావడంతో దుర్వాసన వస్తోంది. దీనికి తోడు ముఖద్వారం వద్ద షాపు యజమానులు అడ్డంగా బారికేడ్లు పెడుతుండడంతో మురుగునీటిలో నడవాల్సిన పరిస్థితి.

ప్రయాణికులకు తప్పని దుర్గంధం..

బస్‌స్టేషన్ పరిసరాల్లో తిరగాలంటే ముక్కు మూసుకోవాల్సిందే.. ప్రయాణికులకు బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఏర్పాటు చేసినా వాటి శుభ్రతను పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు అందులోకి వెళ్లడానికి సంకోచిస్తున్నారు. పలువురు బస్‌స్టేషన్ పరిసరాల్లోనూ మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో నగరానికి వచ్చే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



విమానాశ్రయంలో విద్యార్థులతో సౌమ్య

విద్యావంతులకు విమానయాన భాగ్యం

నందిగామ, మే 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విమానయానం ఆహ్లాదకరంగా సాగింది. తొలిసారి విమానం ఎక్కిన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులతో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మంగళవారం విమాన పర్యటన చేశారు. ఇటువంటి పర్యటనల ద్వారా పేద విద్యార్థుల్లో వికాసం పెంపొందిచవచ్చని ఆమె చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం స్వయంగా విద్యార్థులతో గన్నవరం నుంచి విమానంలో హైదరాబాద్ వెళ్లారు. శంషాబాద్ విమానాశ్రయంలో సౌమ్య బృందానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు స్వాగతం పలికారు. అనంతరం హైదరాబాద్‌లోని పలు ముఖ్యప్రదేశాలలో పర్యటించిన అనంతరం రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణమయ్యారు. విమాన ప్రయాణం తాము ఊహించలేదని, తమకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సౌమ్యకు రుణపడి ఉంటామని విద్యార్థులు తెలిపారు. తమ అభివృద్ధిని కాంక్షించి ఆమె చేసిన ఈ పర్యటనకు ఫలితం ఇస్తామన్నారు. పలువురు నేతలు, ప్రజలు సౌమ్యకు అభినందనలు తెలిపారు.

7 సంస్థలకు భూముల కేటాయింపులు

సీఆర్డీఏ ఆమోదం

» ఈ-13, ఈ-15 రోడ్లను ఎన్‌హెచ్16కు అనుసంధానానికి గ్రీన్ సిగ్నల్
» మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కొత్తగా ఏడు సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ సీఆర్డీఏ అథారిటీ నిర్ణయం తీసుకుంది. గతంలో 64 సంస్థలకు భూములు కేటాయింపులు పూర్తికాగా తాజాగా మంగళవారం సీఎం చంద్రబాబు వద్ద జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో మరో 7 సంస్థలకు కేటాయింపులు చేసింది. మొత్తం 71 సంస్థలకు ఇప్పటి వరకు కోర్ క్యాపిటల్ ఏరియాలో 1050 ఎకరాల కేటాయింపులు చేసిందన్నారు. అథారిటీ వీటితోపాటు మరికొన్ని కీలక నిర్ణయాలను అథారిటీ సమావేశంలో తీసుకున్నారు. వాటికి సంబంధించిన వివరాలను అమరావతి సచివాలయంలో మంత్రి నారాయణ మీడియాకు వివరించారు.

2014-19 మధ్యకాలంలో అమరావతిలో మొత్తం 131 సంస్థలకు భూములు కేటాయింపు చేసామని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరిగి ఆయా సంస్థలతో పలుమార్లు సంప్రదింపులు జరిపాం.. ఎవరెవరు ఎప్పుడెప్పుడు సంస్థల ఏర్పాటు పనులు ప్రారంభిస్తారు, ఎంతెంత స్థలం అవసరం.. అనే దానిపై చర్చించాం. కొన్ని సంస్థలు తమ కార్యాలయాల ఏర్పాటును త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పగా మరికొన్ని సంస్థలు విత్‌డ్రా చేసుకున్నాయి. దీంతో ఆయా సంస్థలకు భూ కేటాయింపులు రద్దుచేసి కొత్తగా వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించి భూ కేటాయింపులు చేస్తున్నామన్నారు. మంగళవారం జరిగిన కేబినెట్ సబ్ కమిటీలో పలు సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపామన్నారు. మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపిన వాటికి సీఆర్డీఏ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అథారిటీ సమావేశంలో కొత్తగా ఆరు సంస్థలకు కేటాయింపులు చేశామని మంత్రి నారాయణ తెలిపారు.

క్వాంటం వ్యాలీకి-50 ఎకరాలు, లా యూనివర్సిటీకి-50 ఎకరాలు, ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్‌కు-0.78 ఎకరాలు, ఐఆర్‌సీటీసీ-ఎకరం, బసవతారకం కేన్సర్ ఫౌండేషన్‌కు గతంలో కేటాయించిన 15 ఎకరాలు, వైద్య కళాశాల నిర్మాణానికి మరో 6 ఎకరాలను కేటాయించామన్నారు. కోస్టల్ బ్యాంక్‌కు 0.4 ఎకరాలు, రెడ్ క్రాస్‌సొసైటీకి- 0.78 ఎకరాలు కేటాయింపులు చేసినట్టు తెలిపారు.

ఉద్యోగుల టవర్ల నిర్మాణానికి రూ. 1,732.31 కోట్ల పనులకు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, మౌలిక వసతుల పూర్తికి, ఎన్జీవోలకు సంబంధించిన 9 టవర్ల నిర్మాణానికి రూ.506.67 కోట్లతో, మరో 12 టవర్ల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు రూ.517.10 కోట్లతో టెండర్లు పిలిచేందుకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. రాజధానిలో 190 ఎంఎల్డీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్‌మెంట్ నిర్మాణంతోపాటు ఐదేళ్లపాటు ఆపరేషన్, నిర్వహణకై రూ.560.57 కోట్లతో టెండర్లు పిలిచేందుకు అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.494.86 కోట్లతో టెండర్లకు ఆమోదం లభించిందన్నారు. జాతీయ రహదారులకు అనుసంధానం చేసేలా ఇ-13 రోడ్డును 4.10 కిలోమీటర్ల మేర రూ. 384.78 కోట్లతో, ఇ-15 రోడ్డును 3.98 కిలోమీటర్ల మేర రూ.70 కోట్లతో మౌలిక సదుపాయాలతో కలిపి పొడిగించేందుకు అథారిటీ నిర్ణయం తీసుకుందన్నారు. ఒక సీడ్ యాక్సిస్ రోడ్డు ఇ-3లో 1.5 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి ఆమోదముద్ర వేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు.



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారుతో మాట్లాడుతున్న దేవదాయ శాఖ అధికారి నటరాజన్ షణ్ముగం, ఈవో సన్యాసిరావు

శ్రీవారి స్థలంలో ఆక్రమణలు తొలగించండి

» కమిషనర్ ఆదేశాల మేరకు ఈవో ఫిర్యాదు

వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు కట్ట దిగువన ఉన్న వన్‌టౌన్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించి, ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవస్థానానికి చెందిన 100 గజాల ఖాళీ స్థలాన్ని స్థానికంగా ఉంటున్న షేక్ నాగూర్ ఆక్రమించి నిర్మాణం చేపట్టాడు. దీనిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'శ్రీవారి స్థలం కబ్జా' కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ జిల్లా దేవదాయశాఖ అధికారి నటరాజన్ షణ్ముగం, దేవస్థానం ఈవో సన్యాసిరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థలంలో నిర్మాణం చేపట్టిన షేక్ నాగూర్‌ను అధికారులు ప్రశ్నించారు. ఆక్రమణలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు షేక్ నాగూర్‌పై ఈవో పటమట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బందరు పోర్టు వయా ఓఆర్ఆర్!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించింది. దీనికి సంబంధించి డీపీఆర్ రూపకల్పన తుదిదశకు చేరుకుంది. గతంలో ఆరు వరసలుగా విస్తరించాలన్న ఉద్దేశ్యంతో చైతన్య కన్సల్టెన్సీతో డీపీఆర్ రూపకల్పనచేయించినా.. మధ్యలోనే ఆపేసింది. అప్పట్లో హైదరాబాద్‌కు ఖమ్మం నుంచి బందరు పోర్టును అనుసంధానించాలన్న ఉద్దేశ్యంతో ఎన్‌హెచ్-216 హెచ్‌ను విస్తరించాలని నిర్ణయించింది. మళ్లీ కేంద్ర ప్రభుత్వం మనసు మార్చుకుని విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65ను విస్తరించాలని డీపీఆర్ తయారు చేయిస్తోంది. హైదరాబాద్ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఎన్‌హెచ్-65ను ఆరు వరసలుగా విస్తరించటానికి మీద అడుగులు పడ్డాయి.

వాహనాల మళ్లింపు..

విజయవాడ నగరంలోకి ట్రాఫిక్ అంతా రాకుండా ఉండటం కోసం అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను రెండు భాగాలకు అనుసంధానంగా ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు ఎన్టీఆర్ జిల్లాలో దాములూరు దగ్గర ఓఆర్ఆర్ మీదుగా అర్ధ చంద్రాకారంలో తిరుగుతూ కృష్ణాజిల్లాలో కంకిపాడు ఎగువన తిరిగి ఎన్‌హెచ్-65 నుంచి నేరుగా బందరు పోర్టుకు చేరుకుంటాయి. మచిలీపట్నంలో ఎన్‌హెచ్-65కు అనుబంధంగా బందరు పోర్టుకు రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వెలుపల నుంచి బందరు పోర్టుకు అనుసంధానం ఏర్పడబోతోంది. ఇదే సందర్భంలో అమరావతి రాజధానికి కూడా మచిలీపట్నం పోర్టు అనుసంధానం అవుతోంది. కంకిపాడు ఎగువన ఎన్‌హెచ్-65 నుంచి అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు చలివేంద్రపాలెం మీదుగా వల్లూరుపాలెం, మున్నంగి, కంచెర్లపాలెం, శేకూరు, సేలపాడు, అనంతవరప్పాడు, పుల్లేటిగుంట, లింగాయపాలెం దగ్గర ఎన్‌హెచ్-16 కు అనుసంధానమవుతుంది. అమరావతిలో ఈ-13, ఈ-15 రోడ్లను ఎన్‌హెచ్-16కు రాజమార్గాలుగా అనుసంధానిస్తున్నారు.

మూడు నెలల్లో టెండర్లు పిలిస్తే..

బందరు పోర్టు పనులు ప్రస్తుతం 40 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి కావటానికి ఎంత లేదన్నా రెండు సంవత్సరాలు పట్టే అవకాశం ఉంది. కమర్షియల్ కార్యకలాపాలు నిర్వహించటానికి మరో 3 నుంచి 6 నెలల వరకు సమయం పట్టవచ్చు. మరో మూడు నెలల్లో కనుక హైదరాబాద్ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఎన్‌హెచ్ - 65 ఆరు వరసల విస్తరణకు సంబంధించి టెండర్లు పిలిస్తే.. రెండేళ్లలో పనులు పూర్తవుతాయి. ఇదే సమయంలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు పనులు కూడా మొదలైతే పూర్తి కావటానికి గరిష్టంగా ఐదేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అందుబాటులోకి వచ్చే వరకు విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ఉపయోగించుకోవచ్చు. గొల్లపూడి నుంచి విజయవాడ వెస్ట్ బైపాస్ మీదుగా వాహనాలను డైవర్షన్ చేయటానికి అవకాశం ఉంటుంది. తూర్పు బైపాస్ కూడా సాకారం అయి ఉంటే ఈ రెండూ మంచి ప్రత్యామ్నాయాలుగా ఉండేవి. తూర్పు బైపాస్ లేదు కాబట్టి.. ఈ వాహనాలను కేసరపల్లి దగ్గర కంకిపాడు బైపాస్ నుంచి ఎన్‌హెచ్ - 65కు చేరుకునేలా చేయవచ్చు.



దేవదాయ స్థలం ఆక్రమించి వేస్తున్న రోడ్డు

ఆలయ భూమి ఆక్రమణ

» వెంచర్‌కు రోడ్డు వేస్తున్న రియల్టర్!
» కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు

కంకిపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు అక్రమార్కులు. ఆలయ భూములు, ఇరిగేషన్ స్థలాలను ఏదీ వదలడం లేదు. కమీషన్ల కక్కుర్తితో అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నెప్పల్లి గ్రామంలో ఓ రియల్టర్ సుమారు 30 ఎకరాల్లో వెంచర్ వేస్తున్నాడు. దానికి రహదారి కోసం సర్వే నెం.101లో 4.41 ఎకరాల ఆలయ భూమిలో కొంత భాగం ఆక్రమించి రహదారి నిర్మాణం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కమీషన్ల మత్తులో అధికారులు మునిగి తేలుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విలువైన భూమి అన్యాక్రాంతంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు గ్రామస్థులు తెలిపారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

ఈ విషయమై దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సృజన్‌ను వివరణ కోరగా నెప్పల్లి గ్రామానికి చెందిన భూమి ఆర్‌ఎస్‌ఆర్‌లో కనకదుర్గ దేవస్థానం భూమిగా, అడంగల్‌లో సత్రం భూమిగా నమోదైందన్నారు. ఆలయ భూమిని రియల్టర్ ఆక్రమిస్తున్నా తెలిసిందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నకిలీల్లో కలవరం!

(5వ పేజీ తరువాయి)

నియామకాన్ని పొందే సమయంలో అతడు తనకు ఆరోగ్యశాఖలో ఉద్యోగం వద్దని, మరో శాఖలో ఇప్పించాలని అప్పటి కలెక్టర్‌కు విన్నవించుకున్నాడు. దీన్ని పరిశీలించిన జిల్లా అధికారులు అతడికి వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగం ఇచ్చారు. తర్వాత కొన్నాళ్లకు అతడు కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించాడు. అనంతరం ఈ ఉద్యోగాన్ని జ్యోతికి ఇచ్చారు. ఉద్యోగం పొందే సమయంలో పదో తరగతి లోపు చదువుకున్నట్టు తెలియజేసింది. దీనికి ఆధారంగా ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నట్టు ఒక ధ్రువీకరణపత్రాన్ని అధికారులకు సమర్పించింది. ఈ ధ్రువీకరణపత్రం అసలైనదేనని అధికారులు భావించారు. కొన్నాళ్ల తర్వాత జ్యోతి కుటుంబంలో వివాదాలు మొదలయ్యాయి. ఆమెకు మేనమామ వరసయ్యే వ్యక్తి జ్యోతి విద్యార్హతకు సంబంధించి నకిలీ ధ్రువీకరణపత్రంతో ఉద్యోగం చేస్తోందని వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం జ్యోతి పార్కు రోడ్డు డివిజన్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తుంది. ఈ ఫిర్యాదు అందిన తర్వాత అధికారులు విచారణ చేసి, సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు ఇచ్చారు. దీనికి స్పందించకపోవడంతో ఆమెను మూడు నెలల క్రితం విధుల నుంచి తప్పించారు. తర్వాత ఉద్యోగ సంఘాల నాయకుల ద్వారా మళ్లీ ఆమె కార్యాలయంలోకి అడుగుపెట్టింది. కొద్దిరోజుల క్రితం పూర్తిస్థాయిలో విచారణ చేసిన అధికారులు జ్యోతికి ఉద్వాసన పలికారు. ఈ విషయాన్ని అత్యంతగోప్యంగా ఉంచారు.

భూ బాధలు!

(5వ పేజీ తరువాయి)

కాదని, ఒట్టిచేతులతో వస్తే పనికాదని, ఏం చేయాలో తెలుసుకుని రండని చెప్పకనే చెబుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుందనే సంకేతాలను పంపుతున్నారని బాధితులు వాపోతున్నారు. గతంలో ఈ భూములకు అనుమతులు ఇచ్చిన నూజివీడు ఆర్డీవో కార్యాలయానికి బాధితులు వెళ్లి సమస్యను వివరిస్తే బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలోనే ఈ భూములకు సంబంధించిన నివేదికను తయారు చేసి కలెక్టరేట్‌కు పంపాలని చెబుతున్నారు. దీంతో పలుమార్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడం బాధితులంతా ఒక మంత్రి వద్దకు వెళ్లి తమ గోడు చెప్పారు. మంత్రి కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. గత నెల 21వ తేదీన బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు అన్ని ఆధారాలు చూపి తమ ప్లాట్‌లను ఉద్దేశపూర్వకంగా 22-ఏలో చేర్చారని.. వెంటనే తొలగించాలని కోరారు. కలెక్టరేట్ నుంచి బాపులపాడు తహసీల్దార్ కార్యాలయానికి ఇందుకు సంబంధించిన పత్రాలు వెళ్లినా ఈ సమస్యను పట్టించుకోకుండా పక్కనపెట్టేశారని బాధితులు వాపోతున్నారు. అన్ని అనుమతులు ఇచ్చి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన నగదును కట్టించుకుని, ఆ తర్వాత ఈ భూములను 22-ఏలో పెట్టడం ఎంతవరకు సమంజసమని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని బాధితులు కోరుతున్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో భూమి సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అధికంగా వస్తున్నాయి. స్థానికంగా ఉన్న తహసీల్దార్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రజలు ఇస్తున్న భూసమస్యలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించకుండా సాచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీలు అందజేస్తున్నారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వెళ్లినా రెవెన్యూ అధికారులు భూమి సమస్యలను పరిష్కరించకుండా మా సంగతేంటని చేతులు చాస్తున్నారనే విమర్శలు బాధితుల నుంచి వినిపిస్తున్నాయి. కొందరు తహసీల్దార్లు అయితే గంటల తరబడి బాధితులను తమ కార్యాలయాల వద్ద నిలబెట్టి లోనికి కూడా రానివ్వని స్థితి నెలకొంది. దీంతో బాధితులు మంత్రుల వద్ద తమ ఇబ్బందులను వివరించి మంత్రుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకువెళ్లి అధికారులకు ఇచ్చినా, సరిదిద్దాల్సిన పనులకు కూడా చేయకుండా జాప్యం చేస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం!

(5వ పేజీ తరువాయి)

అధికారులు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. విజయవాడ నగరంలో రెండు, రూరల్ డివిజన్‌లో ఒక పోలీస్ స్టేషన్‌కు కొత్త ఇన్‌స్పెక్టర్లను నియమించాలని భావిస్తున్నట్టు తెలిసింది. నగరంలో ఉత్తర మండలంలో ఒక ఇన్‌స్పెక్టర్, పశ్చిమ మండలంలో ఒక ఇన్‌స్పెక్టర్ పేర్లు బదిలీ జాబితాలో ఉన్నట్టు కమిషనరేట్ వర్గాల ద్వారా తెలిసింది. ఈ ఇద్దరు కాకుండా తిరువూరు మండలంలో మరో ఇన్‌స్పెక్టర్ పేరు వినిపిస్తోంది. ఈ మూడింటితో బదిలీలను ముగిస్తారా, ఈ సంఖ్యను ఇంకా పెంచుతారా అన్నది త్వరలో తెలుస్తుంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	150, 159, 170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

విటమిన్ సీ మాత్రల పంపిణీ



పెనమలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెల మొదటి మంగళ వారం ఆషాడే సందర్భంగా తాడిగడపలోని మూడవ సచివాలయ పరిధిలో ఫ్లోరోసిస్ బాధితులకు విటమిన్ సీ మాత్రలను పంపిణీ చేశారు. పెనమలూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సాయి లలిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐదేళ్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల, వారికి వచ్చే వ్యాధులు డయేరియా, న్యుమోనియా వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ బదరీనారాయణ తాడిగడప సచివాలయ పరిధిలో విటమిన్ సీ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు బిజిలీ శ్రీనివాసరావు, రాజా, సీహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

పెనమలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : తన పనులు ముగించుకొని బందరు రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి కంకిపాడు వెళ్తున్న కారు ఢీ కొనడంతో గాయపడి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోరంకికి చెందిన కుప్పిలి లక్ష్మణరావు (60) ఈ నెల నాలుగున పెనమలూరు సెంటరులో కిరాణా సామగ్రి కొనుగోలు చేసి, పని ముగించుకొని బందరు రోడ్డుపై దాటుతుండగా విజయవాడ నుంచి కంకిపాడు వెళ్తున్న కారు అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తకు బలమైన గాయమై రక్తస్రావం జరిగి ఆసుపత్రి పాలయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని కుమార్తె భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హనుమాన్ ఆలయం ముస్తాబు

- ఈ నెల 17 నుంచి 22 వరకు ఉత్సవాలు
- రంగులు వేయిస్తున్న ఏలూరుకు చెందిన దాతలు



రంగులతో ముస్తాబు చేస్తున్న అభయాంజనేయ స్వామి దేవస్థానం

(హనుమాన్‌జంక్షన్- ఆంధ్రజ్యోతి)

స్థానిక అభయాంజనేయస్వామి ఆలయాన్ని హనుమజ్జయంతి ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 17 నుంచి 22 వతేదీ వరకు హనుమజ్జ యంతి ఉత్సవాలను నిర్వహించడానికి దేవస్థానం అధికారులు గ్రామస్థులు నిర్ణయించారు. అందులో భాగంగా ఆలయాన్ని రంగులతో అలంకరిస్తున్నారు. ఏలూరుకు చెందిన దాతలు ముందుకు వచ్చి అభయాంజనేయస్వామి ఆలయంతో పాటు ఎదురుగా ఉన్న రామాయాలనికి కూడా రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాలు నిర్వహించడానికి అవసరమైన పందిరి నిర్మాణం చేపట్టారు. కటౌట్లు నిర్మాణం, విద్యుత్ లైటింగ్ అలంకరణలు నిర్మాణం చేపట్టనున్నారు. గత ఏడాది నిర్వహించిన ఉత్సవాలు కంటే ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ఈవో తారకేశ్వరరావు తెలిపారు.



బాధితులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

బాధితులకు సీఎం సహాయనిధి వరం

చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో దీర్ఘకాలంగా బాధపడుతున్న బాధితులకు సీఎం సహాయనిధి గొప్ప వరమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆరుగురు బాధితులకు ఎనిమిదిన్నర లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధికి బాధితులు తమ గోడును వినిపించగానే సత్వరం స్పందించి రోజుల వ్యవధిలోనే సహాయనిధి నుంచి చెక్కులను పంపిణీ చేసే వ్యవస్థను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, తుమ్మలపల్లి హరికృష్ణ, వాసు, తుమ్మల రాంకుమార్, పీతా గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ విద్యార్థిని మృతి

పెనమలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : తన పిన్ని పిల్లలతో పార్కులో ఆడుకోవడానికి వెళ్లి ఊయల ఊగుతుండగా కిందపడి గాయపడ్డ బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కానూరు మాణిక్యనగర్‌కు చెందిన బోకినాల తేజశ్రీ(17) ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. గతనెల ఇరవైన తేజశ్రీ తన పిన్ని పిల్లలతో దగ్గర్లోని పింగళి వెంకయ్య పార్కుకు వెళ్లి ఇనుప ఊయల ఊగుతుండగా ప్రమాదవశాత్తు ఆమె కింద పడింది. దీంతో తన పక్కటెముకకు గాయమై శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో ఆమెను విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



బోల్తా పడ్డ లారీ

ధాన్యంలోడు లారీ బోల్తా

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై పేపర్‌మిల్లు ఎదురుగా ధాన్యం బస్తాల లోడుతో ఉన్న లారీ బోల్తాపడిన ఘటన మంగళవారం జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి మండపేట ధాన్యం లోడుతో ఉన్న లారీ వేగంగా వెలుతూ అదుపు తప్పి ప్రధాన రహదారికి, సర్వీస్ రహదారికి మధ్యలో గల డ్రెయిన్‌లోకి జారిపోవడంతో జాతీయ రహదారిపై బోల్తా పడిందని తెలిపారు. ఆసమయంలో ప్రయాణికులెవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని, డ్రైవరుకు చిన్నపాటి గాయాలవ్వగా ప్రథమ చికిత్స చేయించినట్లు తెలిపారు. ఘటనా స్థలానికి చేరకున్న హెడ్‌కానిస్టేబుల్ ఆలీ సిబ్బందితో కలిసి క్రేన్ సాయంతో లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ధాన్యంలోడును వేరే లారీలోకి మార్చి మండపేట తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాత్రిపూట బహిర్భూమికి వెళ్తూ రైలును గమనించకపోవడంతో గుర్తు తెలియని రైలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారు ఝామున జరిగింది. ఏలూరు రైల్వే ఎస్సై పి. సైమన్ తెలిపిన వివరాల ప్రకారం.. కోడూరుపాడుకు చెందిన చిట్టిబొమ్మల ఏడుకొండలు (58) మంగళవారం తెల్లవారు ఝామున బహిర్భూమికి వెళ్తూ గుర్తుతెలియని రైలు ఢీకొన్న ఘటనలో అక్కడిక్కడే మృతి చెందాడు. చెవుడు కలగిఉండటం వల్ల వస్తున్న రైలును గమనించకపోవడంతో ఘటన జరిగింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసిన అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఏలూరు రైల్వేఎస్సై సైమన్ తెలిపారు.



చినఓగిరాల గ్రామ సచివాలయం వద్ద మనమిత్ర డిస్‌ప్లే చేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కుటుంబరావు

మనమిత్ర ద్వారా పౌరసేవలు వేగవంతం

ఉయ్యూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర ద్వారా వివిధ ధృవపత్రాలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా పౌరసేవలు సత్వరం అందుకోవచ్చని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. చిన ఓగిరాల గ్రామసచివాలయం వద్ద మనమిత్ర బోర్డును మంగళవారం ప్రద ర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలపరిధి 11 గ్రామ సచివాలయాల్లో ప్రజలకు కన్పించే విధంగా మనమిత్ర డిస్‌ప్లే ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు మాట్లాడుతూ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర సేవలకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయనవసరం లేకుండా కూటమి ప్రభుత్వం మనమిత్ర ద్వారా అవకాశం కల్పించి నాంది పలికిందన్నారు. దీనికోసం అధికార వాట్సప్ నంబరు 9552300009 రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని వాట్సప్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని దానితో వర్క్ చేసుకోవచ్చన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాలుడికి చెక్కును పంపిణీ చేస్తున్న మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్ తదితరులు

సహాయనిధి చెక్కు పంపిణీ

పెనమలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరుకు చెందిన బండి హేమకృష్ణ శశిధర్‌కు ఏడేళ్లు, అతని తల్లిదండ్రులు రోజువారీ కూలి చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటారు. శశిధర్‌కు చెవి నుంచి చీము కారడం ప్రారంభమైంది. ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. చెవి వైద్యానికి పెద్దమొత్తంలో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో గ్రామ టీడీపీ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్‌లను సంప్రదించి సాయమడిగారు. వారు బాలుడి దుస్థితిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వివరించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి అధికారుల సాయాన్ని కోరారు. అధికారులు వెంటనే స్పందించి ఎల్వోసీ చెక్కును తయారు చేసి పంపించారు. మంగళవారం పెనమలూరు టీడీపీ కార్యాలయానికి బాలుడిని, తల్లిదండ్రులను పిలిపించి 70వేల విలువైన చెక్కును పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బలరాం, సుభాని, యలమంచిలి ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పూజ కుందెలు, నగదు అపహరణ

వీఎన్‌పురం కాలనీలో దొంగల హల్‌చల్



తాళాలు బద్దలు కొట్టి నగదు అపహరించిన బీరువా

గన్నవరం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి శివారు వీఎస్‌పురం కాలనీలో దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీఎస్‌పురం కాలనీలో వై.దుర్గారావు నివాసం ఉంటున్నారు. ఆయన సోమవారం రాత్రి లేక పోవటంతో ఆయన భార్య పక్కన ఆమె అక్క ఇంటిలో పడుకుంది. మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి తలుపులు తీసి ఉన్నాయి. అదేంటి అని వెంటనే ఆమె భర్త దుర్గారావుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఇంటిని పరిశీలించారు. అలాగే పరిసర ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లోని పూజకు ఉపయోగించే రూ.20వేలు విలువ చేసే దీపం కుందెలతో పాటు రూ.2వేలు నగదు అపహరిం చుకుపోయినట్లు తెలిపారు. అలాగే 5వ నెంబర్ రోడ్డులోని నీలకంఠేశ్వర రావు ఇంట్లో కూడా వస్తువులను చిందర వందరగా చేశారు. ఆ శబ్దాలకు ఇంట్లో వాళ్లు లేచే సరికి దొంగలు పారిపోయారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా వస్తువులు ఏమీ పోలేదు కదా అని పోలీసులు లైట్‌గా తీసుకున్నట్లు తెలిసింది.



ఉంగుటూరులో ఆశావర్కర్లకు యూనిఫాం అందజేస్తున్న హెచ్‌ఎస్ సాల్మన్‌రాజు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఉంగుటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లు అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఉంగుటూరు పీహెచ్‌సీ హెల్త్‌సూపర్ వైజర్ టి.సాల్మన్‌రాజు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని 21మంది ఆశా వర్కర్లకు ప్రభుత్వం నుంచి వచ్చిన యూనిఫామ్‌ను మంగళవారం ఒక్కొక్కరికి రెండుజతలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణకు క్షేత్రస్థాయిలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. ప్రజారోగ్యంతోపాటు తల్లీ, బిడ్డల ఆరోగ్య సంరక్షణ పట్ల మరింత శ్రద్ధకనబరచాలని సూచించారు. ఉంగుటూరు ఏఎన్‌ఎం శ్రీలక్ష్మి, నాగవరప్పాడు, ఆముదాలపల్లి ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల సేవలను చులకన చేయడం తగదు

ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

గన్నవరం : గర్భిణులను గుర్తించి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేసి సర్వీస్ ఎంటర్ చేసేది ఏఎన్‌ఎంలు అని ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎన్ జయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని ముస్తాబాద పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలను సూపర్‌వైజర్లను సీహెచ్‌వోలు చులకన చేయడాన్ని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిలో రక్తహీనత ఉంటే ఐరన్ స్కోర్ తెప్పించేది ఏఎన్‌ఎంలని చెప్పారు. గర్భవతులను మోటివేట్ చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరి అయ్యే విధంగా చూస్తున్నారని అలాంటి వారిని చులకన చేయటం సరికాదని హెచ్చరించారు. ఏఎన్‌ఎంలు సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.



ముస్తాబాద పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు, జయలక్ష్మి



ఉంగుటూరు గ్రంథాలయంలో డ్రాయింగ్ వేస్తున్న చిన్నారులు.. ఉయ్యూరులో యోగా.. వీరవల్లిలో బృంద సమీక్ష

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

ఉంగుటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విజ్ఞాన సముపార్జనకు, మేధో వికాసానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని, గ్రంథాలయాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు, తేలప్రోలు, ఆత్కూరు, మానికొండ గ్రంథాలయాధికారులు యు.చంద్రశేఖరరావు, బి.శ్రీనివాసరావు, బీవీ కృష్ణారావు, ఎల్.హరికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని నాలుగు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థుల నుంచి విశేషస్పందన లభిస్తోంది. మంగళవారం ఆయా గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

ఉయ్యూరు : ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు యోగాసనాలు, చిత్రలేఖనం నేర్పించారు. రిసోర్స్‌పర్సన్ పి.శ్రీరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్ననాటి నుంచి యోగాభ్యాసం చేయడం వల్ల క్రమశిక్షణ, ఆరోగ్యంతో పాటు మంచి అలవాట్లు అలవడతాయన్నారు. అనంతర విద్యార్థులకు చిత్రలేఖనం నేర్పించి, కథల పుస్తకాలు చదివించి వాటిలో నీతి, జ్ఞానాన్ని తెలియజేశారు. గ్రంథాలయ అధికారి బి.రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విద్యార్థులు దేశ చరిత్రను తెలుసుకోవడం ద్వారా వివిధ నాగరికతలు, సమాజంలో జరిగిన ఘటనలపై సమగ్ర అవగాహన వస్తుందని గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి సూచించారు. వీరవల్లి గ్రంథాలయ ఆవరణలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో మంగళవారం భారతదేశ చరిత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కానుమోలులో గ్రంథాలయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు పర్యవేక్షణలో ఆటలతో పాటు క్విజ్ లాంటి మెదడుకు పదును పెట్టే ఆటలను నిర్వహించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏలూరు రోడ్డులోని వాసవీ మాత ఆలయం అమ్మవారికి పెనుగొండ వాసవీమాత ఆలయ జ్యోతితో ఆలయ నిర్వాహకులు మంగళవారం హారతి సమర్పించారు. వాసవీమాత జయంతి ఉత్సవాలు బుధవారం నిర్వహిస్తున్న నేపథ్యంలో తమిళనాడు వాసవీమాత ఆలయ నిర్వాహకులు ఆనవాయితీగా పెనుగొండ అమ్మవారి ఆలయం నుంచి ఆశీస్సులతో కూడిన జ్యోతిని తీసుకొని వెళ్తూ మార్గమధ్యంలో సోమవారం రాత్రి స్థానిక వాసవీ మాత ఆలయంలో బస చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి రామారావు ఆధ్వర్యంలో తమిళనాడు ఆలయ బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. వారు తెచ్చిన జ్యోతితో మంగళవారం అమ్మవారి ఆలయంలో జ్యోతి వెలిగించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ మాత ఆలయ నిర్వాహకులు నారికమల్లి ప్రసాద్, చామర్తి లోకనాథ్,గార్లపాటి రామకృష్ణ, మిట్టపల్లి తేజసందీప, భార్గవి పవిత్ర పాల్గొన్నారు.



జంక్షన్ వాసవీమాతకు పెనుగొండ జ్యోతితో హారతి ఇస్తున్న భక్తులు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి : గొల్లు

హనుమాన్‌జంక్షన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ తెలిపారు. మంగళవారం జంక్షన్ లో ఆయన పలువురికి నియామకపత్రాలు అందజేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామానికి చెందిన నండూరు శ్రీనివాసరావుకు, డీసీసీ కార్యదర్శిగా నియమితులైన గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన షేక్ రఫీ, జాయింట్ సెక్రటరీలుగా నియమితులైన జంక్షన్‌కు చెందిన కె. రవితేజ, మడక లక్ష్మీనాయుడులకు నియామకపత్రాలు అందజేశారు.



ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తమలం ఝాన్సీరాణి, గన్నవరం మండల అధ్యక్షుడు గోగులమూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అపవిత్రం

పవిత్ర సంగమాన్ని అభివృద్ధి చేయాలి

- తిష్ట వేసుకున్న సమస్యలు
- యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినా పట్టని అధికారులు
- వెలగని లైట్లు, పాడైన రోడ్లు, ఎండిపోతున్న చెట్లు
- కళాహీనంగా సంగమం
- ఓ వెలుగు వెలిగిన ప్రాంతం నేడు దయనీయం..!









అమరావతి పునర్నిర్మాణానికి శంకుస్థాపన, పనులు ఊపందుకోవడం రాజధానికి పునర్వైభవం తెచ్చే సూచికలు. విజయవాడ శివారులోని ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. కృష్ణా-గోదావరి నదుల సంగమంగా ఈ ప్రదేశానికున్న భౌగోళిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఎనలేనిది. సరైన నిర్వహణ లేకపోవడంతో కళతప్పింది. ఒకానొక సమయంలో పర్యాటకులతో నిండి ఉండే ఈ ప్రాంతం, ఇప్పుడు నిర్లక్ష్యంతో పాడైపోతున్న దుస్థితిలో ఉంది. మౌలిక సదుపాయాల కొరత, పరిశుభ్రత లోపాలు, అధికారుల నిర్లక్ష్యం వెరసి పవిత్ర సంగమాన్ని నిరుపయోగంగా మిగిల్చివేశారు. పర్యాటకాభివృద్ధి పేరుతో వచ్చిన ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే, అది కేవలం సాంస్కృతికంగానే కాదు, ఆర్థికంగానూ ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మారుతుంది. కృష్ణా-గోదావరి సంగమాన్ని కేంద్రంగా చేసుకొని బోటు సఫారీలు, ఆధ్యాత్మిక యాత్రలు, ప్రకృతి దర్శనం వంటి పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చేయవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచి, శుభ్రత, భద్రత కల్పించి, పర్యాటకంగా ప్రోత్సహిస్తే సంగమానికి పునర్జీవం లభిస్తుంది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా-గోదావరి నదులు కలిసే పవిత్ర సంగమం ఒకప్పుడు ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా వెలుగొందింది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి నిత్య హారతులిచ్చేలా ఏర్పాటు చేసింది. ఈ హారతులను చూసేందుకు భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చేవారు. అయితే, 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో ఈ ప్రాంతం క్రమంగా నిర్లక్ష్యానికి గురైంది. వైసీపీ ప్రభుత్వం హారతులను నిలిపివేయడంతో పవిత్ర సంగమం ఖ్యాతి మసకబారింది.





శిథిలావస్థకు చేరిన కట్టడాలు



పాడైపోయిన బోట్లు

నెరవేరని మంత్రుల హామీ

2024 ఆగస్టు 14న రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పవిత్ర సంగమాన్ని సందర్శించి, త్వరలో నిత్య హారతులు పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అయితే, 10 నెలలు గడిచినా ఈ హామీ నెరవేరలేదు, నిత్య హారతులు ప్రారంభం కాలేదు.

పర్యాటక శాఖ దృష్టి సారించాలి

విజయవాడ నగరానికి అతి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం, కనకదుర్గమ్మ ఆలయం, కొండపల్లి ఖిల్లా, మూలపాడు, నగరం వనం వంటి ప్రాంతాలకు వచ్చే పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉంది. సాయంత్రం వేళల్లో ఆహ్లాదకర, ప్రశాంతమైన వాతావరణం కోసం ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి వాసులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు. పర్యాటక శాఖ దృష్టి సారించి, రోడ్లు, స్నాన ఘాట్లు, లైటింగ్, తాగునీరు, బయో టాయిలెట్స్ పచ్చదనం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిస్తే, పవిత్ర సంగమం మళ్లీ గొప్ప పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందవచ్చు. ప్రభుత్వానికి ఆదాయంతో పాటు, ప్రజలకు ఆధ్యాత్మిక, వినోద వాతావరణాన్ని అందిస్తుందని స్థానికులు, పర్యాటకులు ఆశిస్తున్నారు.

సమస్యల సుడిగుండం

పవిత్ర సంగమం ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతోంది. ఇబ్రహీంపట్నం నుంచి సంగమానికి వెళ్లే రోడ్డు పాడై, కొన్ని చోట్ల పగిలిపోయి, కుంగిపోయింది.నదిలోకి వెళ్లే మెట్లు బురద, చెత్తతో నిండి ఉన్నాయి. చెత్త తొలగించకపోవడంతో భక్తులు, పర్యాటకులు స్నానాలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. మౌలిక వసతుల సమస్య తీవ్రంగా ఉంది. అతిథి గృహాలు నిరుపయోగంగా మారాయి. లైటింగ్ లేకపోవడంతో సాయంత్రం వచ్చే పర్యాటకులు, ముఖ్యంగా పిల్లలతో వచ్చేవారు సెల్‌ఫోన్ లైట్లపై ఆధారపడాల్సి వస్తోంది. పరిశుభ్రత, పచ్చదనం కనుచూపుమేరలోనే లేదు. తాగునీటి వసతులు, బయో టాయిలెట్స్, చెట్లకు నీరు పోసే వ్యవస్థ లేకపోవడంతో పచ్చదనం క్షీణించింది. పారిశుధ్యం అంతంతమాత్రంగా ఉంది.అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయి. స్థానికులు ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమరావతితో పోలిస్తే కృష్ణా నది ఒడ్డున అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం, పవిత్ర సంగమాన్ని నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టిసీమ నుంచి గోదావరి నీటిని కృష్ణానదిలో కలిపి, ఈ సంగమాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. కొండపల్లి ఖిల్లాతో లింక్ చేసి, లేజర్ షో ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించారు. అయితే, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఈ ప్రాంతంపై దృష్టి సారించలేదని స్థానికులు, పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్కారుతోట వాసులకు విముక్తి

- మంత్రి కొల్లు రవీంద్ర ● లబ్ధిదారుల ఇళ్లలో పండుగ వాతావరణం



సర్కారుతోటలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) బ్రిటీష్ కాలం నాటి సర్కారుతోటలో 22 (ఏ)లోని నిషేధిత జాబితా నుంచి విముక్తి కలిగించి భూములను అమ్ముకునేందుకు, కొనేందుకు యజమానులకు అవకాశాలు కల్పించామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం ఉదయం సర్కారుతోటలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి నగరంలోని 4,5 డివిజన్ల సర్కారుతోట పరిధిలోని సెక్షన్ 22 (ఏ)లో నమోదు కాబడిన నిషేద భూములకు మినహాయింపు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ బ్రిటీషు కాలంలో ఏర్పాటైన సర్కారుతోటగా పిలువబడిన ఈ ప్రాంతంలోని భూములు 22 (ఏ) నిషేధిత జాబితాలో ఉండటంతో ఈ ప్రాంతవాసులకు భూముల రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఇప్పటి వరకు అవకాశం లేకుండా పోయిందన్నారు. దీంతో అత్యవసర సమయంలో రుణాల కోసం, అమ్ముకునేందుకు వీలుపడక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సర్కారుతోటలోని భూములను 22 (ఏ) నిషేదిత జాబితా నుంచి తొలగించి 340 మందికి పూర్తి హక్కులు కల్పించి ఉత్తర్వులు జారీ చేస్తున్నామన్నారు. రహదారులు, పార్కులు, చర్చిలు, గుడులు, కమ్యూనిటీ సెంటర్ల భూములకు వేరే సబ్ డివిజన్ చేశామన్నారు. వ్యక్తిగత భూములకు మరో సబ్ డివిజన్ చేశామన్నారు. ఈ ప్రక్రియకు కలెక్టర్ బాలాజీ ఎనలేని కృషి చేశారన్నారు. అలాగే నగరంలో మిగిలిన ప్రాంతాల్లోని రెవెన్యూ సమస్యలున్న భూములను గుర్తించి న్యాయం చేస్తామన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ రవీంద్ర మంత్రి అయిన రోజున సర్కారుతోట వాసుల సమస్య, డంపింగ్ యార్డు సమస్యను చెప్పారన్నారు. సర్కారుతోట వాసుల సమస్యను తీర్చామన్నారు. డంపింగ్ యార్డులోని చెత్తను గుంటూరుకు పంపిస్తున్నామన్నారు. శాశ్వత ప్రాతిపదికన డంపింగ్ యార్డులోని చెత్తను తరలించేందుకు యోచిస్తున్నామన్నారు. బందరు ఆర్డీవో కె.స్వాతి, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, టీడీపీ కార్పొరేటర్ మరకాని సమతాకీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, నగర కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ నాగభూషణం, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ శేఖర్, మాజీ డిప్యూటీ కలెక్టర్ విజయశేఖర్, మాజీ మునిసిపల్ వైస్‌చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, రత్నాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కారుతోట ప్రజలు మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీని ఘనంగా సత్కరించారు. సర్కారుతోటలో ఒక పండుగ వాతావరణంనెలకొంది. దశాబ్దాలుగా తీరని సమస్యకు మంగళవారం తెరపడింది. కాగా ఎన్టీఆర్ కాలనీలోని నిషేధిత భూముల జాబితాలోని ప్రాంతాలకు కూడా విముక్తి కల్పించాలని మునిసిపల్ మాజీ చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీని కోరారు.

జిల్లాలో 80 లక్షల పనిదినాలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ● మోటార్ బైక్‌పై సుడిగాలి పర్యటన ● పలుచోట్ల జరిగిన ఉపాధి పనుల పరిశీలన



పలుగుతో మట్టిని తవ్వుతున్న కలెక్టర్‌లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పని కోరిన శ్రామికులకు ఈ ఏడాది జిల్లాలో 80లక్షల పనిదినాలను కల్పించాలనే లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో మ్యాజిక్ సరోవర్ ట్యాంక్ పనుల్ని, కంచికచర్లలో పంట కుంట, ఫీడర్ చానల్ నిర్మాణ పనుల్ని పరిశీలించారు. మోటార్ బైక్‌పై ఆయన సుడిగాలి పర్యటన చేసి పలు చోట్ల జరుగుతున్న ఉపాధి హామి పథకం పనుల్ని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన పనులు పారదర్శకంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన 80లక్షల పనిదినాల్లో ఇప్పటి వరకు 25 లక్షల పనిదినాలు కల్పించినట్టు చెప్పారు. 3వేల పంటకుంటలను నిర్మించాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. చేపట్టిన పనుల ద్వారా శ్రామికులకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.307 దినసరి వేతనం తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. మల్లె, గులాబి, నారింజ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, జీడి మామిడి, దానిమ్మ, నేరేడు, ఆపిల్‌బెర్రి, మునగ, పామాయిల్ వంటి పండ్ల తోటలను పండించేలా ఉద్యాన రైతులు పంట కుంటలను నిర్మించుకునేందుకు ముందుకొస్తే తక్షణమే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ ద్వారా రైతులకు ఆర్థిక ఊతం కల్పించడంలో జిల్లాను అగ్రగామిగా నిల్పి ప్రభుత్వం ఆశించిన ఫలితాలను సాధించడంలో అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఉపాధి హామి పీడీ ఎ.రాము, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, ఎంపీడీవో బి.లక్ష్మికుమారి, ఏపీడీ వెంకటేశ్వరరావు, ఏపీవోలు ప్రమీళ, రమాదేవి, సతీష్, చంద్ర, జనార్ధన్ పాల్గొన్నారు.

మోటార్ బైక్‌పై సుడిగాలి పర్యటన

కలెక్టర్ జి.లక్ష్మీశ ఉపాధి పనుల్ని పరిశీలించేందుకు కారులో కాకుండా మోటార్ బైక్‌పై వెళ్లి స్వయంగా పనుల్ని పరిశీలించారు. ఉపాధి పనులు జరుగుతున్న చోటికి కారు వెళ్లే మార్గం ఉన్నా అందులో కాకుండా మోటార్ బైక్‌పై సుడిగాలి పర్యటన చేసి పనుల్ని పరిశీలించడమే కాకుండా పలుగు, పార పట్టి కూలీలతో కలిసి మట్టి తవ్వారు. మట్టి ఎత్తారు. గమేళాలకు మట్టి ఎత్తి దాన్ని కూలీల నెత్తినపెట్టారు. ఇలా కూలీలతో కలిసి కొంతసేపు పని చేశారు.

అర్జీ అంటే కాగితం కాదు.. ప్రజల ఆవేదన

- పీజీఆర్ఎస్ సామర్థ్య నిర్మాణ శిక్షణ వర్క్‌షాప్‌లో సీఎంవో పీజీఆర్ఎస్ సెల్ చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ డాక్టర్ చిన్నారావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్ చిన్నారావు, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలు సమర్పించే అర్జీని కాగితంలా భావించొద్దని, వారి వేదనగా భావించి పరిష్కరించాలని అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని సీఎంవో పీజీఆర్ఎస్ సెల్ చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ చిన్నారావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జిల్లాస్థాయి అధికారులకు సామర్థ్య నిర్మాణ శిక్షణ వర్క్‌షాపు జరిగింది. పీజీఆర్ఎస్ ద్వారా గ్రీవెన్స్ రిడ్రసెల్ అధికారి అర్జీని స్వీకరించింది మొదలు నిర్దేశ గడువులో దరఖాస్తుదారుడు పూర్తిస్థాయి సంతృప్తిచెందేలా సమస్యను పరిష్కరించేవరకు వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవహరించాల్సిన తీరుపై చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు సూచనలు చేసి, అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి శాఖకు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గ్రీవెన్స్ రిడ్రసల్ అథారిటీగా ఒకరికి బాధ్యతలు అప్పగించడం జరిగిందని, అర్జీని కిందిస్థాయి అధికారికి అప్పగించకుండా గ్రీవెన్స్ రిడ్రసల్ అధికారే అర్జీదారుడితో ఫోన్‌లో లేదా నేరుగా కలిసి మాట్లాడి, సమస్యను సావధానంగా వినాలన్నారు. సున్నిత అంశాల్లో నేరుగా కలిసి మాట్లాడటం మంచిదన్నారు. మండలస్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో తదితర అధికారులు అర్జీల పరిష్కారంలో ప్రత్యక్ష భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. అప్పుడే అర్జీల పరిష్కారంలో నాణ్యతతో పాటు సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. కిందిస్థాయిలో పరిష్కారానికి వీలులేని వాటిని సరైన విధంగా పైస్థాయికి పంపాల్సి ఉంటుందని, అలాగే అర్జీదారుడికి తెలుగులో స్పష్టమైన వివరణతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలు, దార్శనికతకు అనుగుణంగా కలెక్టర్ సారథ్యంలో పీజీఆర్ఎస్‌ను జిల్లాలో విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని చిన్నారావు సూచించారు. గ్రీవెన్స్ రిడ్రసల్ ఆడిటింగ్, ఫీడ్‌బ్యాక్ మెకానిజం తదితరాలపై వర్క్‌షాపులో వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మండల, డివిజన్ స్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.



కృష్ణాజిల్లా కలెక్టర్‌ను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

కలెక్టర్ బాలాజీకి అవార్డు

- రేపు గవర్నర్ చేతుల మీదుగా అందజేత

మచిలీపట్నం టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మానవతా దృక్పథంతో బుడమేరు వరద బాధితులను ఆదుకోవడంలో ఉత్తమ పనితీరు చూపిన కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఈ నెల 8న జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా ఉన్న గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లోతట్టు ప్రాంతాల బాధితులను పరిరక్షించడంలో కీలకపాత్ర పోషించినందుకు గాను రాష్ట్ర స్థాయిలో ఈ అవార్డును బాలాజీకి ప్రదానం చేస్తున్నారు. ఎదురుమొండి వరద బాధితులకు బాసటగా నిలిచారు. వారికి ఆహార పదార్థాలు అందించారు. ఒడ్డున చేర్చేందుకు మంగినపూడి నుంచి విజయవాడకు 140 పడవలను పంపి అక్కడి వరద బాధితులను ఆదుకున్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను విస్తృత పరిచారు. ఈ నెల 8న ప్రపంచ తలసీమియా, రెడ్‌క్రాస్ దినోత్సవం నాడు రాజ దర్బార్‌లో గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ బాలాజీని జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు శంకర్‌నాథ్, బాలాజీ, రాం బాలాజీ శాలువా, మొక్కతో అభినందించారు.

సమగ్రశిక్ష పీడీగా కుమిదినిసింగ్

మచిలీపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష పీడీగా ఆర్ కుముదిని సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది పల్నాడు జిల్లా కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను కృష్ణాజిల్లాకు బదిలీ చేశారు. మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)లో డెప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఇడవలపాటి పద్మావతిని గుంటూరు జిల్లా సర్వశిక్ష పీడీగా బదిలీచేశారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 13 నుంచి

పీజీడీసీఏ కోర్సులో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలో డాక్టర్ బీవీరాజు ఫౌండేషన్ (భీమవరం), శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, స్వర్ణభారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైబర్ గ్రామీణ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 13 నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ (పీజీడీసీఏ) కోర్సులో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు శిక్షణాకేంద్రం అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి జి.అంకమ్మరావు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కోర్సు నేర్చుకున్న యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగసంస్థల్లో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయన్నారు. బీఎస్సీ, బీటెక్, బీఏ, డిప్లొమా చదివి, 18నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ఆంధ్ర, తెలంగాణకు చెందిన యువత ఈ కోర్సులో శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. కోర్సు కాలవ్యవధి 3 నెలలుంటుందని, శిక్షణాకాలంలో అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ధ్రువీకరణపత్రాలు, ఈ-కోర్సు మెటీరియల్ అందజేయడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో సంస్థ సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 91000 33552, 80949 32997 నెంబర్లలో సంప్రదించాలని అంకమ్మరావు సూచించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: మంత్రి లోకేశ్



లోకేశ్‌కు వినతిప్రతం ఇస్తున్న వల్లూరు శివప్రసాద్ తదితరులు

విజయవాడ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరాదరణకు గురౌతున్న గ్రంథాలయాల అభివృద్ధికి, మాతృభాషా వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ వెల్లడించారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న ప్రజాదర్బార్‌లో ఆయన్ను కలిశారు. నగరంలో ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్ని రాష్ట్ర సదస్సు చేసిన తీర్మానాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో మాదిరిగా పుస్తక మహోత్సవాన్ని ఎన్టీఆర్ ట్రస్టుతో కలిసి జరపాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు కొనుగోలు, ఉద్యోగాల భర్తీ విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధి వంటి వాటిపై కసరత్తు చేస్తున్నామని, అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లోకేశ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్, బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య ప్రతినిధులు వెంకట నారాయణ, గోళ్ల నారాయణరావు ఉన్నారు.

20న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి: వడ్డే

గాంధీనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లతో ఈ నెల 20న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులు, రైతులు, కౌలు రైతులకు కార్మిక, కర్షక సంఘాలు పిలుపునిచ్చాయి. రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ల రాష్ట్రస్థాయి సంయుక్త సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగింది. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ జాతీయ రైతు నేత రాకేష్ తికాయిత్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. సీ2+ 50 ప్రకారం పంటల మద్దతు ధరల చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు మాఫీ చేయాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్లకు అనుకూలంగా మోదీ ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. దీనిలో భాగంగానే కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా చేపట్టబోయే సమ్మెతో కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. రైతు సంఘం నేతలు వై.కేశవరావు, కేవీవీ.ప్రసాద్, చుండూరు రంగారావు, కార్మిక సంఘాల నేతలు యం.రామకృష్ణ, పొలారి, మరీదు ప్రసాద్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	150, 159, 170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

మచిలీపట్నం టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు భవిత సెంటర్ దివ్యాంగ విద్యార్థి వి.భరత్‌బాబు స్పెషల్ ఒలింపిక్ భారత్‌కు ఎంపికైనట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ముదిగొండ ధూర్జటి తెలిపారు. జూన్‌లో జాతీయ స్థాయిలో అహ్మదాబాద్‌లో జరిగే స్పెషల్ ఒలింపిక్ భారత్‌కు భరత్‌బాబు ఎంపిక కావడం ముదావహమన్నారు. ఆగిరిపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో భరత్‌బాబు ప్రథమ బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఉయ్యూరుకు చెందిన మరో విద్యార్థి కృష్ణచైతన్య కాంస్య పతకం సాధించారన్నారు. ఇద్దరు విద్యార్థులను సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య సమన్వయకర్త రాంబాబు తదితరులు అభినందించారు.

బందరులో తాగునీటి సమస్య రానీయం

మచిలీపట్నం టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రెండో డివిజన్ మాచవరంలో రూ.2 కోట్ల 68 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రిజర్వాయర్‌ను మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమృత పథకం కింద 2014లో నిధులు మంజూరు చేయించామని, తరువాత అధికారం లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణాలను పూర్తి చేయలేక పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రిజర్వాయర్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించిదన్నారు. భవిష్యత్తులో నగరంలో 14 ప్రాంతాల్లో రిజర్వాయర్లు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మునిసిపల్ కమిషనరు బాపిరాజు, టీడీపీ కార్పొరేటర్ మరకాని సమతా కీర్తి, నాయకులు మాదివాడ రాము, గనిపిశెట్టి గోపాల్, కరెడ్ల సుశీల, నాగరాజు, పద్మ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో తాగునీటి రిజర్వాయర్ ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రవీంద్ర

వేకనూరు ఎంపీటీసీ సభ్యుడు నరేష్ చొరవ

అవనిగడ్డ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : వేకనూరు ఎంపీటీసీ సభ్యుడు తుంగల నరేష్ సమీప గ్రామం తుంగలవారిపాలెం గ్రామానికి తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలోని రెండు ఊర చెరువులతోపాటు రక్షిత మంచినీటి పథకానికి తాగునీరు అందించే చెరువులకు మోటారు షెడ్ల నిర్మాణం చేపట్టారు. మండల పరిషత్ నుంచి రూ.9.50 లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. ఊర చెరువులు, రక్షిత మంచినీటి పథకానికి రెండు మోటార్ల షెడ్లను ప్రత్యేకంగా నిర్మించి రక్షిత మంచినీటి పథకానికి అనుసంధానం చేయడంతో తాగునీటి ఎద్దడి రాకుండా నరేష్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు అభినందిస్తున్నారు.



తాగునీటి చెరువు మోటార్ల కోసం ఎంపీటీసీ సభ్యుడు నరేష్ చొరవతో నిర్మిస్తున్న షెడ్డు

దివ్య భౌతికకాయం గుర్తింపు

● తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు

మచిలీపట్నం టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : నిశ్చితార్థం జరిగిన అనంతరం కన్పించకుండా పోయిన ఎన్.గొల్లపాలెం గ్రామానికి చెందిన కుక్కల దివ్య (18) వెంకటాపురం వద్ద గుండేరులో శవమై తేలింది.

కెకెఆర్ గౌతం స్కూలులో టెన్త్‌క్లాస్‌లో 600లకు 576 మార్కులు సాధించిన దివ్య ఉన్నత చదువులు చదువుకుందామనుకుంది. బావతో పెళ్లి చేసేందుకు తలిదండ్రులు నిర్ణయించడంతో వారి మాట కాదనలేక తలూపింది. ఉన్నత చదువుకోవాలన్న ఆశ నెరవేరకపోవడంతో మనస్తాపం చెందిన దివ్య సోమవారం తండ్రి టీవీఎస్ వేసుకుని వెళ్లి కన్పించలేదు. గుండేరు వద్ద టీవీఎస్‌ను గుర్తించిన పోలీసులు రాత్రంతా గుండేరులో జాలర్లతో వెతికించారు. మంగళవారం గుండేరులో గాలిస్తుండగా, డగా వెంకటాపురం వద్ద దివ్య మృతదేహం కనపడింది. దివ్య తండ్రి సురేష్ బాబు, అతని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండడం అందరినీ కంటతడి పెట్టించింది. దివ్య మృతదేహానికి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష చేయించి తండ్రి సురేష్‌కు అప్పగించారు. ఎస్సై నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓఎన్జీసీలో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి

అవనిగడ్డ, మే 6 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలోని ఓఎన్‌జీసీలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి చొరవ చూపాలని ఎంపీ వల్లభనేని బాలశౌరికి న్యాయవాది బడే గౌతమ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఓఎన్‌జీసీ కార్యకలాపాలు ప్రారంభించే సమయంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ఓఎన్జీసీ పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఈ ప్రాంతంలో సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేయటంతోపాటు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ఎంపీ బాలశౌరి కృషి చేయాలని గౌతమ్ కోరారు.



ఎమ్మెల్యే మండలికి కొత్తపేట ప్రజల సత్కారం

అవనిగడ్డ, మే 6 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట - మోదుమూడి రహదారికి రూ.55 లక్షలు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను జనసేన ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను నేతృత్వంలో కొత్తపేట గ్రామస్థులు మంగళవారం ఘనంగా సత్కరించారు. యలవర్తి రాజేష్, గరికపాటి శ్రీను, దివి శ్రీను, భూపతి శ్రీను, యలవర్తి చిన్నా, యలవర్తి ఆంజనేయులు, కూనపరెడ్డి చంద్రశేఖర్, పులిగడ్డ పసి, రేపల్లె అంకినీడు, అన్నపురెడ్డి గాంధీ, యలవర్తి వాసు, మత్తి శివపార్వతీ, చందన శ్రీను, కమ్మిలి సాయిభార్గవ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఘంటసాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఘంటసాల పాలెం చిన్న దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం బాలికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎం జి.సునీత మాట్లాడుతూ, 18 సంవత్సరాల నిండిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలని సూచించారు. రక్తహీనత, పర్సనల్ హైజీన్, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్త జి.కమల కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కనకదుర్గ, ఎన్.మానస, ఎం.ఉమాదేవి, కిశోర బాలికలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



బాలికలు, తల్లులకు కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు



మత్స్యశాఖ సహాయ సంచాలకులకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మత్స్య భవనానికి మరమ్మతులు చేయాలి

అవనిగడ్డ, మే 6 (ఆంధ్రజ్యోతి) : గతేడాది వరదల కారణంగా ధ్వంసమైన మత్స్యభవనం, ప్లాట్ ఫారం మరమ్మతులను తక్షణం చేయించాలని కోరుతూ అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రతిభకు మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి మంగళవారం విజ్ఞాపన పత్రం అందజేశారు. సముద్రములో చేపల వేట నిషేధం ముగిసేలోపు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద వివిధ స్కీములకు ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్లను అందిస్తే ఎంతో ఉపయోగపడతాయన్నారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు. మత్స్యకార నాయకులు నాగిడి తాతారావు, లంకె శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పంట కాలువ తవ్వకం పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు బంగారుబాబు, నీటి సంఘం వైస్ చైర్మన్ శివప్రసాద్, రైతులు

స్వచ్ఛందంగా పంటకాల్వ పూడికతీత

చల్లపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సరఫరా సరిగాలేని పంట కాల్వలో రైతులే స్వచ్ఛందంగా పూడికతీత పనులు చేపట్టారు. తొమ్మిదో నెంబరు పంట కాలువ నుంచి పాగోలు ఆయకట్టుకు సాగునీటి సరఫరా కోసం రైతులు ఎక్స్‌కవేటర్ సహాయంతో మంగళవారం పూడికతీత పనులు చేశారు. కాలువ పూడుకుపోయి ఉండటం, గత కొన్నాళ్లుగా తవ్వకం పనులు చేపట్టకపోవటంతో స్వచ్ఛందం ముందుకువచ్చి సొంత ఖర్చులతో పనులు చేయించుకున్నట్లు రైతులు తెలిపారు. పాగోలు ఎంపీటీసీ సభ్యుడు మేకా సత్యనారాయణప్రసాద్ (బంగారుబాబు), కె.కొత్తపాలెం నీటి సంఘం వైస్ చైర్మన్ మేకా శివప్రసాద్, రైతులు మట్టా కమలాకరరావు, నరేష్, దిరిశం ప్రకాశరావు, గూడవల్లి జయరాజ్ పనులు పర్యవేక్షించారు.



నారాయణరావు నగర్‌లో హెచ్ఎం దాస్, ఉపాధ్యాయుల ప్రచారం

ప్రైవేట్ పాఠశాలల పిల్లలు ప్రభుత్వ బడిలోకి..

చల్లపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలంటూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, నారాయణరావునగర్ మోడల్ పాఠశా హెచ్ఎం కైతేపల్లి దాస్ చేపట్టిన ఇంటింటి ప్రచారం సత్ఫలితాలను ఇస్తోంది. మంగళవారం పాఠశాల టీచర్లతో కలిసి కాలనీలో ప్రచారం చేపట్టారు. పదవ తరగతిలో ఇటీవల అత్యధిక మార్కులు సాధించిన పాఠశాల పూర్వవిద్యార్థిని బ్యూలా పాలవెల్లి సైతం ఉపాధ్యాయులతో కలిసి ప్రచారంలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో వసతి సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. మంగళవారం ప్రైవేటు పాఠశాలల్లో చదివే నలుగురు పిల్లలను కాలనీలోని మోడల్ పాఠశాలలో చేర్చేందుకు తల్లిదండ్రులు అంగీకారం తెలియజేశారు. టీచర్లు చంద్రకుమారి, విజయ దుర్గ, రాధారాణి, దుర్గాప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పర్యవేక్షణాలోపం - ఉపాధి శ్రామికులకు శాపం

● 120 మంది కూలీల పేర్లు మస్తరులో మాయం



పెడనరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అధికారుల పర్యవేక్షణా లోపం ఉపాధి పను లు చేస్తున్న శ్రామికులకు శాపంగా మారాయి. కూలీలకు తక్కువ పనిదినాలు కల్పించడం, మస్తర్లు సరిగా వేయక పోవడం, ఉపాధి కూలి సొమ్ము సరిగా ఇవ్వకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. బల్లిపర్రులో ఉపాధి పనుల్లో చోటు చేసుకున్న లోపాలే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. పది రోజుల క్రితం బుద్ధాలపాలెం దగ్గర రామరాజు పాలెం కాల్వ నుంచి శింగరాయపాలెం వరకు 20 మంది కూలీలు వారం రోజుల పాటు 120 పనిదినాలు జంగిల్ క్లియరెన్స్ పనులు చేశారు. ఆన్‌లైన్‌లో పనుల వివరాలు నమోదయ్యాయి. వారం రోజుల తరువాత ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలను కలిసి మీ పని దినాలు ఆన్‌లైన్‌లో కన్పించడం లేదని చెప్పడంతో అవాక్కయ్యారు. ప్రతిరోజూ ఆటోలో వెళ్లి ఎండను సైతం లెక్క చేయకుండా పను లు చేస్తే మస్తరులో తమ పేర్లు కన్పించపోవడంతో ఆందోళనతో మండల పరిషత్ కార్యాలయానికి రాగా, ఏపీవో అందుబాటులో లేరు. పంచాయతీ సభ్యుడు బత్తిన రమేష్ ఫోన్ చేయగా, మీటింగ్‌లో ఉన్నానంటూ ఏపీ వో సమాధానం ఇచ్చారు. డిగ్రీ చదివిన తాను కుటుంబ అవసరాల కోసం చిన్న పిల్లలను పక్కింటి వారికి అప్పగించి ఉపాధి పనులకు వస్తే నాలుగు వారాలు మాత్రమే పని ఇచ్చారని, రెండు వారాల నుంచి పనులు లేవు అంటున్నారని పినిశెట్టి స్వప్న వాపోయింది.

వివరాలు తెలియనీయడం లేదు



ఎంత పని చేస్తున్నాం ఎంత కూలి వస్తుందనే వివరాలు తెలియనీయటంలేదు. పనిముట్లు ఇవ్వరు. తాగేందుకు నీరుండదు. పనులు చేసినా ఫొటోల కోసం గంటల తరబడి కూర్చోబెడతారు. అవకతవకలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టి సారించాలి.

- చందన ఈశ్వరరావు, బల్లిపర్రు

పని చూపటం లేదు



పదిహేడేళ్లుగా ఉపాధి పనులు చేస్తున్నా. ప్రతి ఏటా 100 రోజులు పని కల్పించాలి. 40 రోజులు పని ఇస్తారు. తరువాత పనులు లేవంటారు. కొం దరు పనులకు రాక పోయినా వారి పేరున మస్తరు వేసి, మాలాంటి వాళ్లకు పనులు లేకుండా చేస్తున్నారు.

-పెద్దపల్లి ఝాన్సీ, బల్లిపర్రు.

సమస్య పరిష్కరిస్తాం

ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగే అవకాశాలు లేవు. అటువంటివి జరిగితే మా దృష్టికి తీసుకురావాలని మేట్లకు చెపుతున్నాం. తక్షణం స్పందిస్తాం. తప్పులు జరిగితే వాటిపై చర్యలు ఉంటాయి. పనులు పారదర్శకంగా జరిపిస్తున్నాం.

- వజీర్ అహ్మద్, ఇన్‌చార్జి ఏపీవో

అక్రమ తూములు తొలగించకుండా యూటీ నిర్మాణం ప్రతిపాదనలపై రైతుల అభ్యంతరం

కోడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఇరాలి గ్రామం వద్ద రత్నకోడు మేజర్ డ్రెయిన్ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్‌లోకి అక్రమంగా వేసిన తూములు తొలగించకుండా 14 నెంబర్ పంట కాలువ వద్ద యూటీ నిర్మాణానికి ప్రతి పాదనలు పంపించటం ఏమిటని రైతు సంఘం నాయకులు రేపల్లె యోగ ప్రకాష్ ప్రశ్నించారు. యోగ ప్రకాష్, దిగువ ప్రాంతం రైతులు మం గళవారం పాత్రికేయులతో మాట్లాడారు. పాలకాయితిప్ప అవుట్ పాల్స్ స్లూయిస్ నిర్మాణం, రత్నకోడు నుంచి వేసిన అక్రమ తూముల తొలగింపు పనులు చేపట్టిన తర్వాతే న్యూ ఇరాలి డ్రెయిన్‌కు యూటీ ఏర్పాటు చేయాలని, లేకుంటే ముంపు రెట్టింపు అవుతుందని తెలిపారు. నీటి సంఘాల అధ్యక్షులు, తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సమస్యను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు పూర్తిగా వివరించాలని కోరారు. జొన్నలగడ్డ గోపాలరావు, నాదెళ్ల ఈశ్వరరావు, చక్కా వెంకటేశ్వరరావు, బాలగోపాల రామకృష్ణరాజు పాల్గొన్నారు.

పోలీసుల మైక్ ప్రచారం

బంటుమిల్లి, మే 6(ఆంధ్రజ్యోతి) : దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలంటూ బంటుమిల్లి పోలీసులు మంగళవారం ఎస్సై గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో మైక్ ప్రచారం చేశారు. ఎవరైనా ఇల్లు వదిలి వెళ్లే ముందు సమాచారాన్ని తెలియజేయాలని, చిన్నపాటి అనుమానం వచ్చినా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. వి హారయాత్రలకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

గ్రంథపఠనం ఎంతో మేలు

మోపిదేవి, మే 6 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయులు కంఠమనేని కుటుంబరావు తెలిపారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో పిల్లలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు చదవడం, ఆటలాడం వల్ల మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. స్థానిక గ్రంథాలయాధికారి కైతేపల్లి సుధీర్ కుమార్ వేసవిలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వం నేర్పిస్తున్నారు.



సంపద కేంద్రాల పరిశీలన

ఘంటసాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : వి.రుద్రవరం, చిలకలపూడి గ్రామాల్లోని సంపద సృష్టి కేంద్రాలను ఎంపీడీవో సుబ్బారావు మంగళవారం పరిశీలించారు. కంపోస్టు తయారీ గుంటలను సరిగా ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లో కంపోస్టు తయారీ గుంటలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సర్పంచ్‌లు రామకృష్ణ ప్రసాద్, కొణతం విజయలక్ష్మి, కార్యదర్శులు సతీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

బంటుమిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి లక్ష్మీపురంసెంటర్‌లో మంగళవారం శ్రీ వినాయక నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎస్సై గణేష్‌కుమార్ మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీ వినాయక నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంల మజ్జిగ పంపిణీ, రోగులకు పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. యూనియన్ అధ్యక్షుడు మాటూరి కుమార్, పొదిలి వెంకన్న, ఏసు, దేవరపల్లి శ్రీను, మేడూరి శివసాయిబాబు, ముత్యాలపల్లి దుర్గారావు, కొమ్మాలపాటి రవి, జంపాల సాయి, కొమ్మాలపాటి సాయి బాలాజీ, నవీన్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు జనసేన సభ్యత్వ కార్డు

అవనిగడ్డ, మే 6 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీలో భాగంగా మంగళవారం అత్యధికంగా సభ్యత్వాలు చేర్పించిన అవనిగడ్డ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు బచ్చు కృష్ణకుమారి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు సభ్యత్వ కార్డు అందజేశారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వీర మహిళ కృష్ణకుమారిని బుద్ధప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

హనుమాన్‌చాలీసా పారాయణం

అవనిగడ్డ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అశ్వారావుపాలెం కోదండ రామాలయంలో ప్రతిరోజు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నారు. ప్రసన్నాంజనేయ స్వామికి 11 రకాల పిండి వంటలు, గారెలు దండలు సమర్పిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.

భావన్నారాయణస్వామి కల్యాణ మహోత్సవాలు రేపటి నుంచి

నాగాయలంక, మే 6 (ఆంధ్రజ్యోతి) : భావదేవరపల్లిలో శ్రీదేవి,భూదేవి, రాజ్యలక్ష్మి సమేత భావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 8 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో సిహెచ్.సుధాకరరావు తెలిపారు. 8వ తేదీన స్వామి, అమ్మవార్లను వధూవరులను చేయడం, 9న నిత్యార్చన, 10న జగాజ్యోతి, 11న కల్యాణ మహోత్సవం, 12న భారీ అన్నసమారాధన, రాత్రి 8 గంటలకు రథోత్సవం, 13న పవళింపు సేవలతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయన్నారు. రాత్రి పూట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కావున భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు తెలిపారు.

తెలుగు మహాసభలకు దివిసీమ కవులకు ఆహ్వానం

నాగాయలంక, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు 2వ వారంలో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో జరిగే అంతర్జాతీయ తెలుగు మహాసభలకు దివిసీమలోని కవులు, కళాకారులు విరివిగా పాల్గొనాలని నవ్యాంధ్రుల రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కమిలిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ తెలుగు మహాసభలకు దేశ వ్యాప్తంగా వెయ్యి మందికిపైగా కవులు, కళాకారులు పాల్గొంటారన్నారు.

ఆసక్తి గల కవులు, కళాకారులు తమ పేర్లను జూన్ 30వ తేదీలోపుగా 9246415150, 8977555564, 8374439053 నెంబర్లలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

సహాయ ఫౌండేషన్ 1779 సేవా కార్యక్రమాలు

పెడన, మే 6 (ఆంధ్రజ్యోతి) : సహాయం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొమ్మిదేళ్లలో 1779 సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సహాయ ఫౌండేషన్ తొమ్మిదో వార్షికోత్సవం ఇందిరా కాలనీలోని ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎందరో దాతలు ముందుకు వచ్చి అందించిన సహాయ సహకారాల వల్లే ఇన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిం చగలిగామన్నారు. నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. తొలుత కేకు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఫౌండేషన్ నిర్వాహకులు ఎండి ఉస్మాన్‌బాషా, మట్టా రాధాకృష్ణమూర్తి, మామిడి ప్రసాద్, రౌతుల ప్రసాద్, ఖుర్షిద్ బేగం, కోన వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాతృమూర్తులకు వందనం

మచిలీపట్నం టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : తల్లిని మించిన దైవం లేదని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ అన్నారు. సత్యసాయి మందిరంలో మంగళవారం అష్టోత్తర శత మాతృక వందన కార్యక్రమం జరిగింది. 108 మంది తల్లులకు 108 మంది పిల్లలు పాదాలకు అర్చించి మాతృవందనం చేశారు. సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, పాతూరి జ్ఞానేశ్వర శర్మ, పి. కళ్యాణి, పి. విశాలి, వరప్రసాద్‌లు మాట్లాడారు. బాలవికాస్ కేంద్రాలకు చెందిన నిర్వాహకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాధవస్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి

గూడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : గూడూరులో శ్రీదేవి భూదేవి సమేత మాధవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని వంశపారంపర్య ధర్మకర్తలు కలపటపు నవరంగి కిషన్, కలపటపు వేణుగోపాల్, కలపటపు రవికిషన్, కలపటపు కృష్ణకిరణ్‌కుమార్ తెలిపారు. 8న స్వామి వారిని, అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెను చేయడం, 9న నిత్యహోమం, బలిహరణ, సామూహిక కంకుమార్చన, 10న జగాజ్యోతి, శేషవాహనంపై స్వామి వారి ఊరేగింపు, 11న కలపటపు కృష్ణారావు, రుక్మి ణమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్త్రీలకు ముగ్గుల పోటీలు, రాత్రికి స్వామి వారి దివ్య కల్యాణం జరుగుతాయన్నారు. 12న గరుడ సేవ, పుష్పయాగం, రథోత్సవం, 13న పవళింపుసేవ, తీర్థప్రసాదాల వితరణ జరుగుతాయన్నారు. అర్చకులు గంజాం సీతారామాచార్యులు, యాజ్ఞీకులు అగ్నిహోత్రం రఘునాధశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

ఘనంగా జాతీయ నృత్య పోటీలు

గుడివాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శివజ్యోతి నృత్యాలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక టీటీడీ కల్యాణమండపంలో జాతీయ నృత్య పోటీలను నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో 170కి పైగా కళాకారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు తమిళనాడు, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు చెందిన నృత్య కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల ప్రారంభోత్సవ సభలో పలువురు నాట్యరంగ ప్రముఖులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల విలువను కాపాడేవి నృత్య ప్రదర్శన లేనని, వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నాట్య గురువులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, నృత్యాలయ నిర్వాహకులు సరితా నెహ్రూ పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనిస్తున్న చిన్నారులు

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారమే ధ్యేయంగా తాను వార్డు పర్యటనలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం మీకోసం -మీ వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా స్థానిక 7వ వార్డులో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌తో కలిసి పర్యటించారు. డ్రెయినేజీ సమస్యలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వచ్చాయి. వార్డు వ్యాప్తంగా డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించేలా, డ్రెయినేజీ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. డ్రెయినేజీల సమస్య పరిష్కారానికి తాత్కాలిక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, డీఈ సతీష్‌చంద్ర, ఏఈ రాజేష్, టీడీపీ నాయకులు పంద్రాజు సాంబశివరావు, గద్దం ప్రకాష్ దాసు, జబీన్, మురళీ, ఏడుకొండలు, రమేష్, మంగరాజు, చిన్నారావు, ఆంజనేయులు, మహేష్ పాల్గొన్నారు.

గుడివాడ : ప్రజలకు సహకార సంఘాలు ఉత్తమ సేవలందించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సహకార సంవత్సరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులతో బ్యాంకు లావాదేవీలు తదితర అంశాలపై చర్చించారు. జిల్లా సహకార అధికారి కె.చంద్రశేఖర్‌రెడ్డి, బ్యాంకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ సి.హెచ్ రవికుమార్, బ్యాంకు సీఈవో టి.ఎస్.ఎస్.ఆర్ చౌదరి, పాల్గొన్నారు.



డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ : ఆర్ఎంపీలు, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల స్వగృహంలో ఆర్ఎంపీలు, పీఎంపీలు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీహెచ్ఎంపీఏ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు సాగిరాజు ఉదయభాస్కరరాజు మాట్లాడుతూ గతంలో 429, 465 జీవోలను ప్రభుత్వాలు ప్రకటించాయి గానీ, వివిధ కారణాలతో జీవోలు రద్దు అయ్యాయన్నారు. గత ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్ఎంపీలు, పీఎంపీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. అసెంబ్లీలో తమ సమస్యలను ప్రస్తావించాలని ఎమ్మెల్యే వెనిగండ్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నండూరి ఉమాశంకర్, సంయుక్త కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు, ప్రాంతీయ నాయకులు పోలిశెట్టి వెంకట రామారావు, ఎర్రంపాయుడు, ప్రదీప్‌కుమార్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెనిగండ్లకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీ వైద్యులు



వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌సీపీ రెడ్డి

టిడ్కో కాలనీలో సమస్యలను పరిష్కరించాలని వినతి

గుడివాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి వినతీపత్రం అందజేసినట్టు సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాలనీలో ప్రధానంగా ప్రాథమిక పాఠశాల, పోలీస్ స్టేషన్, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలన్నారు. కాలనీకి ప్రజారవాణ వ్యవస్థని ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. స్పందించిన కలెక్టర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించినట్టు ఆర్‌సీపీ తెలిపారు.



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సునీల్

అమ్మవారి ఉత్సవాలను జయప్రదం చేయాలి

గుడివాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం, పట్టణ ఆర్యవైశ్య సంఘంల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7వతేదీన నిర్వహించనున్న కన్యకా పరమేశ్వరీ అమ్మవారి 4642వ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్ కోరారు. మంగళవారం స్థానిక కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘ నాయకులతో కలిసి ఉత్సవ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ ఐక్యతను చాటేలా వ్యాపారసంస్థలకు సెలవు ప్రకటించి అమ్మవారి ఉత్సవాలను జయప్రదం చేయాలని గోకవరపు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

మల్లిఖార్జునస్వామి కల్యాణ మహోత్సవాలు నేటి నుంచే

పామర్రు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఎలకుర్రు అగ్రహారంలో వేం చేసి యున్న భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి వార్ల 265వ కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు వ్యవస్థాపక కుటుంబ ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 7న అంకురార్పణతో ప్రారంభమై వేదపఠనం, సహస్రనామార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నిత్యాఔపోసన బలిహరణ, సాయంత్రం ధ్వజారోహణ అనంతరం శ్రీకృష్ణతులాభారం నృత్యప్రదర్శనలు ఉంటాయన్నారు. 8న ఉదయం వేదపఠనం, సహస్రనామార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నిత్యఔపోసన, బలిహరణ, రామాంజనేయయుద్ధంలో(యుద్ధసన్నివేశం), విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవం 9న వేదపఠనం, సహస్రనామార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నిత్యఔపోసన, బలిహరణ,10న సహస్రనామార్చన, విశేష పూజలు, బాలసరస్వతి నాట్యమండలి వారిచే సత్యహరిచంద్ర నాటకం, అర్ధరాత్రి 2గంటలకు స్వామి వారి కళ్యాణ మహోత్సవం, 11న విశేష పూజలు, వీరభద్రస్వామి వారివీధిపళ్ళెం 12న అన్నసమారాధన, ఏకాదశ ప్రదక్షణలు, త్రిశూలస్థానం, అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.



ఆలయంలో వేం చేసి ఉన్న భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి

ప్రభుత్వ మిగులు భూముల పరిశీలన

పామర్రు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఐనంపూడి గ్రామంలో ని 10 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూములను ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమలు)కు బదాలయింపునకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలస్థాయి అధికారులు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ఐనంపూడిలోని మంగళవారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ప్రభుత్వం మిగులు భూములను పరిశీలించారు. సంబంధిత భూములను ఈనెల 7న రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా చేతుల మీదగా లాంఛనంగా అప్పగించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందరు పార్లమెంట్ పరిధిలోని తొలిసారిగా పామర్రు నియోజకవర్గంలో సూక్ష్మ చిన్నమధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పడం కోసం ప్రభుత్వ భూములను పరిశీలించామన్నారు. పరిశ్రమలు పామర్రుకు రావడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు ఎంతోగానో మెరుగుదలకు అవకాశం కలుగుతుందన్నారు. ఐనంపూడి పేదవర్గాల ప్రజలు గ్రామస్థులు సహకరించాలని కోరారు.



మిగులుభూములను పరిశీలిస్తున్న వర్లకుమార్‌రాజా

క్రీడాకారులను ప్రోత్సహించాలి

గుడివాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, ముఖ్యమైన క్రీడా పోటీలను నిర్వహించి ఎన్టీఆర్ స్టేడియం పేరుప్రతిష్టలు పెరిగేలా కమిటీ కృషి చేయాలని జిల్లా కలెక్టర్, స్టేడియం కమిటీ చైర్మన్ డీకే బాలాజీ పేర్కొన్నారు. స్థానిక స్టేడియంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో విద్యార్థులను ఎంపిక చేసుకుని, వారికి ఏ క్రీడల్లో నైపుణ్యం ఉందో గుర్తించి శిక్షణిచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణివ్వాలన్నారు. రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చేలా మారథాన్ పరుగుపందాలను నిర్వహించాలని, కబడ్డీ పోటీలను నిర్వహించాలని కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఇండోర్ స్టేడియం భవనాల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కలెక్టర్ బాలాజీకే ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ మున్సిపల్, రహదారుల, భవనాల ఇంజనీర్‌లతో కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపి నిజాలను నిగ్గుతేల్చాలని ఆదేశించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుడ్లవల్లేరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, పోలీసుల సూచనలను పాటిస్తూ దొంగతనాలు, సైబర్ నేరాల నుండి రక్షణ పొందాలని గుడ్లవల్లేరు ఎస్సై వి.వి.సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మైక్ ద్వారా వేసవిలో దొంగతనాలను అరికట్టాలంటే ప్రజలు పాటించాల్సిన విషయాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వేసవి సెలవల్లో విహార యాత్రలకు, బంధువుల ఇళ్లకు వెళ్ళడం ఎక్కువ గా ఉంటుంది. అలా గ్రామం విడిచి వెళ్లాలనుకొనేవారు పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లడం వంటివి చేయాలని ఎస్సై సూచించారు. రాత్రి సమయంలో తలుపులు తీసి నిద్రించడం, ఆరుబయట నిద్రించడం వటింవి తగదని ఆయన విజ్ఞప్తి చేశారు. అలానే సైబర్ నేరాల విషయంలో అప్రమత్తత అవసరమన్నారు. ఓటీపీలు ఎవరికి పడితే వారికి చెప్పవద్దన్నారు. పోలీసులమని ఇలా బెదింపు ఫోన్లు చేసినా కంగారు పడక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.



మైక్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు

పాఠశాలలో పింగాణి వాష్‌బేసిన్ చోరీ

తోట్లవల్లూరు, మే 6(ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాత్రి తాగుబోతులు విధ్వంసం సృష్టించారు. చీకటి పడిన తరువాత ప్రతిరోజూ మందుబాబులు, గంజాయి బ్యాచ్ వచ్చి పాఠశాల ఆవరణలోనే గడుపుతున్నారు. వీరిని అరికట్టే వారు లేకుండా పోయారు. దీంతో సోమవారం రాత్రి తాగిన మైకంలో మందుబాబులు రెచ్చిపోయారు. ఒక బాత్రూంకు తాళం వేసి ఉన్నప్పటికీ బోల్టులు ఊడతీసి లోపల చేతులు కడిగే పింగాణీ వాష్ బేసిన్‌ను మంగళవారం ఎత్తుకెళ్లిపోయారు. మరో వాష్ బేసిన్‌ను వంచేశారు. అలాగే బాత్రూంల బయట ఉన్న విద్యార్థులు భోజనం చేసి ప్లేట్లు, చేతులు కడిగే ట్యాప్‌ల తొట్టెను పగులకొట్టేశారు. మంగళవారం ఉదయం ఈ సమాచారం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయిని ఎం విజయశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంజాయి బ్యాజ్ చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



చోరీకి గురైన పింగాణీ వాష్ బేసిన్

మొవ్వలో చేబ్రోలు వర్ధంతి కార్యక్రమం

కూచిపూడి, మే 6 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకులు కీర్తిశేషులు చేబ్రోలు భాస్కరరావు వర్ధంతి కార్యక్రమాన్ని మొవ్వలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ సిద్ధాంతాలు ముందుకు తీసుకెళ్లటంతోపాటు పేదల పక్షాన భాస్కరరావు అనేక ఉద్యమాలు నడిపారని నేతలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బసవయ్య, నారాయణరావు, రాజశేఖర్, రమేష్, శ్రీనివాసరావు, లాజరు, పాల్గొన్నారు.

పంచాయతీ చెరువు తవ్వకాలు నిలిపివేయాలి : ఈవోపీఆర్‌డీ

గుడివాడ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మోటూరు పంచాయతీ చెరువు తవ్వకాలు నిలిపివేయాలని ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఈవోపీఆర్‌డీ పంచాయతీ చెరువును పరిశీలించారు. గత సోమవారం మోటూరు గ్రామానికి చెందిన గంటా శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్‌కు పంచాయతీ చెరువు అక్రమంగా తవ్వుతున్నారని కలెక్టర్‌కు మెమొరాండం అందజేశారన్నారు. మంగళవారం ఈవోపీఆర్‌డీ పరిశీలించి మళ్లీ తవ్వవద్దని తెలిపారు. అనుమతులు లేకుండా చెరువు తవ్వితే ఊరుకోమని తెలిపారు. ఈ విషయమై గ్రామస్థులు, పంచాయతీ సిబ్బందితో చర్చించి గ్రామ పెద్దలతో మాట్లాడారు.



వల్లూరుపాలెంలో తడిసిన మొక్కజొన్న రాశి

తోట్లవల్లూరులో భారీ వర్షం

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలంలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. 30 నిమిషాల పాటు భారీ వర్షం కురవటంతో మొక్కజొన్న రైతులకు దెబ్బమీద దెబ్బ తగిలినట్టయింది. మూడ్రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి తడిసిన మొక్కజొన్న పంటను ఆరబెట్టగా మళ్లీ వర్షం వచ్చి తడిసిపోయింది. దీనివల్ల తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వల్లూరుపాలెం, రొయ్యూరు గ్రామాల్లో, లంకల్లో మొక్కజొన్న పంట తడిసింది.

అన్నక్యాంటీన్‌లో అన్నవితరణ

గుడివాడ : స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల పక్కన గల అన్నక్యాంటీన్‌లో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కట్నేని సాంబశివరావు 6వ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి రాణి, కుమారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ జిల్లా అధ్యక్షులు జయలక్ష్మీ, గుడివాడ శాఖ కార్యదర్శి నందమూరి పద్మజ పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

గుడివాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని రోటరీ క్లబ్ కౌన్సిలర్ జి.బాబుశ్రీకర్ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ, బీడీపీఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఏలూరురోడ్డులోని పవన్‌ప్లాజాలోని బీడీపీఎస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ చైర్‌పర్సన్ కె.వెంకటేశ్వరరావు, యూత్ సర్వీసెస్ చైర్‌పర్సన్ రెడ్డియ్య చౌదరి, బీడీపీఎస్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎం.రాఘవ, కుమార్, క్లబ్ అధ్యక్షుడు టి.ఎస్ రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్ బాబు, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి జి.నరేష్, పూర్వ అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణ, ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, బి.శంకరరావు, ఎం.రమణమూర్తి, పాల్గొన్నారు.



శిక్షణను ప్రారంభిస్తున్న ఆడిటర్ బాబుశ్రీకర్

పుస్తకపఠనంతోనే విద్యార్థులకు విజ్ఞానం



పొడుపు కథలను వివరిస్తున్న ఉషాదేవి

పామర్రు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు పుస్తక పఠనాశక్తి, విజ్ఞాన వికాసం పెంపొందించడం కోసం గ్రంథాలయాలు దోహదం చేస్తాయని పామర్రు, జమీగొల్వేపల్లి మహిళ మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం పాఠశాల స్థాయి విద్యార్థులకు కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునీకయుగంలో పుస్తక పఠనానికి విద్యార్థులు మక్కువ చూపడం లేదన్నారు. తొలుత విద్యార్థులకు అవసరమైన టేబుల్స్, చిన్న చిన్న పొడుపు కథలను ఆమె వివరించారు. జమీగోల్వేపల్లికి చెందిన కోల్లినాయుడమ్మ, పి.వెంకట ధర్మారావు గ్రంథాలయాధికారి నాగ సురేష్, పాల్గొన్నారు. పామర్రు గ్రంథాలయంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా చదరంగం,ఖో ఖో ఆటల పోటీలపై లైబ్రరియన్ ఎం.ఝాన్సీరాణి అవగాహన కల్పించారు.

గుడ్లవల్లేరు:విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు వేదికలవుతాయని గుడ్లవల్లేరు శాఖాగ్రంథాలయాధికారిణి టి.వాణి అన్నారు. చిన్నారులచే వివిధ ఆటలు ఆడించారు.

ఉరివేసుకుని ఒకరి మృతి

తోట్లవల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు శివారు కనకదుర్గమ్మ కాలనీలో నివాసముంటున్న కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పేర్ల సుధాకర్‌రెడ్డి(33) మంగళవారం ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందినట్టు ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. ప్రొద్దుటూరు నుంచి వచ్చి మూడేళ్లుగా తోట్లవల్లూరులో నివాసముంటున్నాడు. విజయవాడ, పెనమలూరులో ట్రావెల్స్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం బయటకు వెళ్లిన సుధాకర్‌రెడ్డి సోమవారం ఇంటికి వచ్చాడు. మంగళవారం ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడని ఎస్సై తెలిపారు. తల్లి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ,దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



బీమా చెక్కు అందిస్తున్న వర్ల కుమార్ రాజా

ప్రతి కార్యకర్తకు టీడీపీ అండగా ఉంటుంది

కూచిపూడి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతీ కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. నిడుమోలు గ్రామానికి చెందిన కోట పోతురాజు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. అతని కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ప్రమాద బీమా రూ.5 లక్షల చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు. పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతీ కార్యకర్తకు బీమా వర్తించేలా పార్టీ ముందు చూపుతో వ్యవహరించటం వల్ల బాధిత కుటుంబాలకు కొంత మేర ఆర్థిక భరోసా సమకూరుతుందన్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న వాణి

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన

గుడ్లవల్లేరు, మే 6 (ఆంధ్రజ్యోతి) :బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు వాణి పేర్కొన్నారు. కౌతవరం, విన్నకోట గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో అంగన్వాడీల్లో మంగళవారం కిశోర వికాసం వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రం, ఋతుక్రమం, గుడ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విన్నకోట కార్యదర్శి ఈశ్వరి కుమారి, సోషల్‌వెల్ఫేర్ అధికారి ఎం.చినరాయుడు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.